PRGI Reg No -“APTEL/26/A1193

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...
శుభోదయ
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 110, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 10 - జూన్ - 2026 , వెల రూ.5/-

# నెతన్యాహుకు వేరే ఛాన్స్ లేదు..



- ఇరాన్‌తో చర్చలు కొనసాగుతాయన్న ట్రంప్
- ఒప్పందానికి నెతన్యాహు అంగీకరించాల్సిందేనన్న అమెరికా అధ్యక్షుడు
- ఒప్పందం చేసుకోకపోతే ఇరాన్‌పై దాడులు ఉంటాయని హెచ్చరిక

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే మిగతా 2లో

# ‘వాస్తవంలో బతకండి మిస్టర్ ట్రంప్’.. నీళ్లు చల్లిన టెహ్రాన్!



- వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది.
- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీతో భవిష్యత్తులో సమావేశం కావచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

టెహ్రాన్: వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీతో భవిష్యత్తులో సమావేశం కావచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. మిగతా 2లో

# భారత్‌పై ఆంక్షలు విధిస్తే బూమరాంగే!




- అలాంటి హెచ్చరికలు పనిచేయవు
- ఆంక్షల బెదిరింపులతో భారత్‌ను లొంగదీసుకోలేరు
- తేల్చిచెప్పిన రష్యా అధినేత పుతిన్

నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్న భారతదేశంపై ఆంక్షలు విధించాలన్న ఆలోచన ఎవరికైనా ఉంటే వెంటనే మానుకోవాలని రష్యా అధినేత పుతిన్ హితవు పలికారు. మిగతా 2లో

## ‘మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి’.. క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను



- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం 2లో
- విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేశ్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ
- కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేశ్ పరామర్శ

# రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు
# సీఎం చంద్రబాబు

**జూన్ 10, 11 తేదీల్లో దేశ రాజధానిలోనే బస**

- రెండు రోజుల పర్యటన నిమిత్తం నేడు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం
- తొలి రోజు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి హాజరు
- రెండో రోజు నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో పాల్గొననున్న సీఎం
- 11వ తేదీ రాత్రికి తిరిగి అమరావతికి రాక



అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన నిమిత్తం దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు, ఎల్లుండి ఆయన ఢిల్లీలో పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశం, నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉదయం 11:30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో పాల్గొంటారు. మరుసటి రోజు గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ఈ సమావేశం ఉదయం 9:15 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు అమరావతి చేరుకుంటారు.



## బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పవన్ పరిశీలన
- కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి

విశాఖపట్నం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగతా 2 లో

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం అత్యంత విషాదకరం

**బీహార్‌లో నెల్లూరు యాత్రికుల బస్సు ప్రమాదం బాధాకరం: వైయస్ జగన్**

- విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
- స్టీల్ మెల్టింగ్ షాప్-2 (ఎస్ఎంఎస్-2)లో హాట్ మెటల్ బకెట్లు కూలిపోవడంతో లిక్విడ్ స్టీల్ కార్మికులపై పడటం వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు.



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.స్టీల్ మెల్టింగ్ షాప్-2 (ఎస్ఎంఎస్-2)లో హాట్ మెటల్ బకెట్లు మిగతా 2లో



## సీఎం విజయ్‌తో చెస్ ఆడిన ప్రజ్ఞానంద..

ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. విన్సెంట్ కీమర్(జర్మనీ)పై అతడు గెలుపొంది నార్వే చెస్ టోర్నీ టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద రికార్డు సృష్టించాడు.

చెన్నై: ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ మిగతా 2లో

## సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరం

**గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్.. జగన్ అండ్ కోకి పయ్యావుల స్ట్రాంగ్ వార్నింగ్**

- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మన ప్రత్యర్థి ప్రజాస్వామ్యవాది కాదని.. అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని ఎద్దేవా చేశారు.



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రత్యర్థి ప్రజాస్వామ్యవాది కాదని.. అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని ఎద్దేవా చేశారు. ఈరోజు(సోమవారం) నంద్యాల జిల్లాలో మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించి, మిగతా 2లో

## స్వచ్ఛమైన గోదావరి జలాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలి



- పీసీబీ అధికారులపై పవన్ కల్యాణ్ సీరియస్.. చర్యలకు ఆదేశం
- గోదావరి నదిని అత్యంత పవిత్రంగా భావించే కోట్ల మంది భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, నదీ పరివాహక ప్రాంతాల పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
- రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు మిగతా 2లో

## ఉత్తరాంధ్రలో ఆర్ఈఈ
# రిఫైనింగ్ హబ్

**విశ్రాంత ఆర్చ్‌బిషప్ డాక్టర్ ప్రకాశ్ మల్లవరపు మృతి.. నారా లోకేశ్ సంతాపం**

**మాస్కో కేంద్రంగా గిరెడ్మెట్**

**మాస్కో అణుశక్తి మ్యూజియం సందర్శన**

- రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ మాస్కోలో సమావేశమయ్యారు.
- భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుందన్నారు.
- విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్‌బిషప్ మోస్ట్ రెవ. డాక్టర్ ప్రకాశ్ మల్లవరపుమృతిపై.. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు.
- డాక్టర్ ప్రకాశ్ మల్లవరపు తుదిశ్వాస విడవడం ఎంతో బాధాకరమని లోకేశ్ పేర్కొన్నారు.
- విద్యావంతుడిగా, ఆధ్యాత్మికవేత్తగా ఆయన తన జీవితాన్ని క్రైస్తవ సమాజ సేవకు అంకితం చేశారని కొనియాడారు.



రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ మాస్కోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుందన్నారు. మిగతా 2లో



## మాజీ సైనికోద్యోగుల సేవలను పార్టీ బలోపేతానికి వినియోగించుకుంటాం

- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మాజీ సైనికోద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.
- రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాజీ సైనికోద్యోగులు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మాజీ సైనికోద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాజీ సైనికులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాజీ సైనికోద్యోగులు మిగతా 2లో

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
బుధవారం - 10 - జూన్ - 2026

# నెతన్యాహుకు వేరే ఛాన్స్ లేదు..

తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ స్పష్టం చేశారు. "ఇక్కడ అన్ని నిర్ణయాలు నేనే తీసుకుంటాను. నెతన్యాహు కాదు. భవిష్యత్తులో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందే" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఇరాన్‌పై ఎదురుదాడి చేయొద్దని నెతన్యాహును ట్రంప్ కోరనున్నట్లు సమాచారం. ఇలాంటి సైనిక చర్యల వల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ.."మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి" అని పిలుపునిచ్చారు. అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు. "మేం ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం. ఒకవేళ ఇరాన్ వినకపోతే వారిపై బాంబులతో విరుచుకుపడతాం" అని ఎన్‌బీసీ న్యూస్ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలతో పాటు సైనిక ఒత్తిడిని కూడా కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

## 'వాస్తవంలో బతకండి మిస్టర్ ట్రంప్'.. నీళ్లు చల్లిన టెహ్రాన్!

ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి భేటీ ఆశించడం ముమ్మాటికీ అవాస్తవికమని, అమెరికా అధ్యక్షుడు ఇకనైనా 'వాస్తవంలో బతకడం' అలవాటు చేసుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు ముందుకు సాగితే, ఇరాన్ అగ్ర నాయకత్వంతో నేరుగా చర్చలు జరపవచ్చని డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమంపై విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకునే వ్యూహంలో భాగంగా, మొజ్తబా ఖమేనీతో చారిత్రాత్మక భేటీకి తాను సిద్ధమంటూ సంకేతాలు ఇచ్చారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని లెబనాన్ ఛానల్ 'అల్ మయాదీన్' ఇంటర్వ్యూలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కొట్టిపారేశారు. 2026 మార్చిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన సైనిక దాడుల్లో అప్పటి ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించారు. ఆ తర్వాత ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ అత్యున్నత రాజకీయ, మతపరమైన పదవిని చేపట్టారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఆయన ప్రజల్లో ఎక్కువగా కనిపించకపోయినప్పటికీ, ఇరాన్ అంతర్గత, విదేశాంగ విధానాలను శాసించడంలో ఆయనే కీలక పాత్ర పోషిస్తున్నారని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. యుద్ధం నాల్గవ నెలలోకి ప్రవేశించిన ఈ తరుణంలో ఆయనతో భేటీ కావడం ట్రంప్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. అమెరికా ఎంతగా చర్చల ప్రతిపాదనలు ముందుకు తెస్తున్నా, ఇరు దేశాల మధ్య నమ్మకరాహిత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు, మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఘర్షణలు దౌత్యపరమైన పురోగతికి ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# భారత్‌పై ఆంక్షలు విధిస్తే బూమరాంగే!

ఆంక్షల బెదిరింపుల ద్వారా భారత సార్వభౌమతాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే తక్షణమే పెద్ద ఎదురుదెబ్బ(బూమరాంగ్) తగులుతుందని తేల్చిచెప్పారు. సెంటర్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పుతిన్ ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ ఎల్లప్పుడూ ఒక సార్వభౌమ దేశంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఆంక్షల బెదిరింపులతో భారత్‌ను లొంగదీసుకోలేరని పరోక్షంగా తేల్చిచెప్పారు. ప్రధాని మోదీతో తాను చాలాకాలంగా సన్నిహితంగా చర్చలు జరుపుతున్నానని తెలిపారు. అమెరికాలోకి ప్రవేశించకుండా మోదీపై గతంలో నిషేధం విధించారని గుర్తుచేశారు. ఆ విషయాన్ని మోదీ ఎప్పటికీ మర్చిపోలేరన్న సంగతి తనకు తెలుసని అన్నారు. మోదీ ఇప్పుడు ప్రధానమంత్రి అయ్యారు కాబట్టి ఆయనపై అన్ని ఆంక్షలను తొలగించారని పేర్కొన్నారు. తనకు తెలిసినంతవరకు అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు విజయవంతంగా అభివృద్ధి చెందుతున్నాయని వెల్లడించారు.

# స్వచ్ఛమైన గోదావరి జలాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలి

గోదావరి నదిని అత్యంత పవిత్రంగా భావించే కోట్ల మంది భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, నదీ పరివాహక ప్రాంతాల పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నదిని స్వచ్ఛంగా ఉంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. నదీ జలాల కాలుష్య నియంత్రణపై పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన గోదావరి నదిలోకి మురుగునీరు, పరిశ్రమల వ్యర్థాలు కలవకుండా చూడటంలో అధికారులు విఫలమవడంపై ఆయన మండిపడ్డారు. పర్యావరణ పరిరక్షణ, నది స్వచ్ఛత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అధికారులను పవన్ కల్యాణ్ హెచ్చరించారు. పర్యావరణ నియమాలను బేఖాతరు చేస్తూ, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. నదిని కాలుష్య రహితంగా మార్చేందుకు తక్షణమే క్షేత్రస్థాయిలో కఠినమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పుష్కరాల నాటికి భక్తులకు స్వచ్ఛమైన గోదావరి జలాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు..

### మాజీ సైనికోద్యోగుల సేవలను పార్టీ బలోపేతానికి వినియోగించుకుంటాం

సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన సైనికులు ఇప్పుడు సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. మాజీ సైనికోద్యోగుల అనుభవం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను సమాజాభివృద్ధి కోసం వినియోగించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజకీయాలను ప్రజల సంక్షేమం, అభ్యుదయానికి సాధనంగా మాత్రమే భావించే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలు అంటే అధికార రాజకీయాలు కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే జగన్ గారి లక్ష్యమని అన్నారు. డిఫెన్స్ సర్వీసుల్లో పనిచేసిన మాజీ సైనికుల సేవలను పార్టీ పరంగా ఎలా వినియోగించుకోవాలన్న దానిపై సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఒక అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసి, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

## 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'.....

ఢిల్లీ: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, "అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్తైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత" అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు. ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. "నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ. 25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం" అని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. "ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు.

### బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# పరీక్షలంటే తెలియని వారు కూడా బురద జల్లుతున్నారు

అమరావతి: పరీక్షలు అంటే ఏమిటో, రిజర్వేషన్లు అంటే ఏమిటో తెలియని వ్యక్తులు డీఎస్సీ నియామకాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం సిద్ధాంతంలో నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేశారని, తాము అధికారంలోకి వచ్చాక దాదాపు 16 వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు. ఏం చెప్పాలో తెలియక నేరాలు చేసి, ఎదుటివారిపై దుష్ప్రచారం చేయడమే 'గొడ్డలి పార్టీ' పనిగా పెట్టుకుందని విమర్శించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకురారని, కోడికత్తి డ్రామాలు ఆడేవాళ్లకు వరికోతలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. భూ వివాదాలకు తావులేని గోదావరి జిల్లాల్లో గత పాలకులు చిచ్చుపెట్టి రికార్డులు తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి ప్రజల భూములను కాజేయాలని చూశారని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. "మేం అధికారంలోకి రాగానే ఆ నల్ల చట్టాన్ని రద్దు చేసి భూ యాజమాన్య హక్కుల్ని కాపాడాం. భూమి మీది, కానీ ఫొటోలు వారివి ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై కూడా వారి బొమ్మలు వేసుకున్నారు" అని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి పటిష్టమైన చర్యలతో, కరెన్సీ నోట్ల తరహా భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 6,688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 26.46 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేశామని, నిర్దేశిత గడువులోగా మొత్తం 90 లక్షల పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తెచ్చి, 1.37 లక్షల ఎకరాల సర్వీస్ ఇనామ్ భూములను 22ఏ నుంచి తప్పించామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని చంద్రబాబు తెలిపారు. ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో సభలు పెడుతున్నామన్నారు. "అభివృద్ధిని తిరిగి ట్రాక్‌లో పెట్టాం. అందుకే రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి, యువతకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం. సూపర్ సిక్స్‌లో చెప్పిన వాటికంటే అదనంగానే ఇచ్చాం" అని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం వాటాతో కలిపి రైతులకు ఏటా రూ. 20 వేలు అందిస్తున్నామని చెప్పారు. దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా ఉన్న గోదావరి జిల్లాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు పడిన ఇబ్బందులను గుర్తుచేస్తూ, తాము 24 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50కే అందిస్తున్నామని, ఫీడ్ ధరల పెరుగుదల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. తెలంగాణలో ఎమ్మార్వో, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రూ. 1500 కోట్ల భూకుంభకోణానికి పాల్పడిన వినుకొండ మాజీ ఎమ్మెల్యేను వైసీపీ అధ్యక్షుడు ఎందుకు సస్పెండ్ చేయలేదని చంద్రబాబు ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి అపవిత్రం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత 'గొడ్డలి పార్టీ'కి లేదని, వారు రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే గంజాయి బ్యాచ్‌లను, గొడ్డలి పార్టీ వ్యక్తులను ప్రజలు దూరంగా పెట్టాలని పిలుపునిచ్చారుఅంటూ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కాళ్లల్లో కట్టెలు పెట్టి ఆపుతున్నారని ఆయన ఆరోపించారు. "రీజనల్ రింగ్ రోడ్డు అనుమతుల కోసం నేను యాభై సార్లు ఢిల్లీకి వెళ్లాను, ప్రధానిని కలిశాను. దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కిషన్ రెడ్డికి లేదా హైదరాబాద్ ప్రజలు ఆయనకు ఓట్లు వేయలేదా" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అన్ని అనుమతులు వచ్చాక మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని, మూసీ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, మిగిలిన 25 లక్షల టన్నులను కేంద్రంతో కొనిపించే బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని నిలదీశారు. బీజేపీలో ఉంటూనే చీకట్లో ఇతరులతో కిషన్ రెడ్డి సహకారం తీసుకుంటున్నారని, గతంలో కుమ్మక్కు రాజకీయాలు చేసినందుకే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అభివృద్ధి విషయంలో తాను రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని సీఎం స్పష్టం చేశారు. "నిజంగా నేను రాజకీయం చేస్తే, బీఆర్ఎస్ నేత బండారు లక్ష్మారెడ్డి తండ్రిగారైన బండారు రాజిరెడ్డి పేరును ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు పెట్టేవాడిని కాదు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తించాం" అని తెలిపారు. అభివృద్ధి కోసం కలిసి వస్తే ఎల్బీ స్టేడియంలో కిషన్ రెడ్డికి గండపెండేరం తొడుగుతామని, కానీ ఆయన సహకరించడం లేదని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం వల్లే తాను ఈరోజు ముఖ్యమంత్రిగా ఉన్నానని, కొడంగల్‌లో ఓడిపోయిన తనను ఇక్కడి ప్రజలే ఆశీర్వదించి గెలిపించారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. మల్కాజిగిరిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే పరిపాలన సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. మూసీ ప్రక్షాళన రెండో దశను నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపడతామని, వంద రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు చేద్దామని, ఇప్పుడు నగరాభివృద్ధికి అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. మెజార్టీ ఎమ్మెల్యేల వ్యవహారశైలీపై సీఎం రేవంత్ రెడ్డి గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కంటే, సొంత ప్రయోజనాల కోసమే ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారని అభిప్రాయంలో ఆయన ఉన్నట్టు సమాచారం. తన వద్దకు వచ్చిన ప్రతీసారి ఏదో ఒక పైరవీ పేపరు ఇవ్వడం ఎమ్మెల్యేలకు పరిపాటిగా మారిందంటూ ఆయన కొందరు సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. రాజకీయాల్లో రాణించాలని తపన కంటే, అవకాశం ఉన్నప్పుడే వెనుకేసుకోవాలని తాపత్రయం మెజార్టీ ఎమ్మెల్యేల్లో ఉందని ఆయన కామెంట్ చేసినట్టు సమాచారం. సహజంగా ఎమ్మెల్యేలు సీఎంను కలిసినప్పుడు తమ నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలి

# ఉత్తరాంధ్రలో ఆర్-ఈ-ఈ రిఫైనింగ్ హబ్

విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరుల ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ అండ్ రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. భారత్‌లో విస్తరిస్తున్న ఈవీ, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేయడానికి నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం వహించాలన్నారు. భారతీయ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్-అండ్-ప్లే ప్రయోగశాలల మద్దతుతో మెటలర్జీ అల్ట్రా-ప్యూర్ సెమీకండక్టర్ అండ్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ సహస్థాపనకు చొరవ చూపాలని కోరారు. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి వ్యూహాత్మక అరుదైన లోహాలను వెలికితీయడానికి, తగిన సాంకేతికతలను అమలు చేయడంలో భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. 1931లో స్థాపించిన గిరిడ్మెట్ సంస్థ మాస్కో కేంద్రంగా పనిచేస్తుంది. ప్రభుత్వ అణుశక్తి కార్పొరేషన్ 'రోసాటామ్' శాస్త్ర, సాంకేతిక వ్యవస్థలో కీలక పరిశోధన-డిజైన్ సంస్థగా కొనసాగుతోంది. రేర్ ఎర్త్ మూలకాలు, కీలక లోహాలు, సెమీ కండక్టర్ పదార్థాలు, అధిక శుద్ధి రసాయనాల రంగాల్లో ఈ సంస్థకు ప్రత్యేక నైపుణ్యముంది. గిరెడ్మెట్ సంస్థ జాతీయ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేసే కేంద్రంగా పనిచేయడంతో పాటు అంతర్జాతీయ సహకారాల ద్వారా కూడా తన ప్రభావాన్ని విస్తరించుకుంటోంది. మాస్కోలోని ప్రత్యేక ప్రయోగశాలలు, పైలట్ స్థాయి పరీక్షా సౌకర్యాలు, డిజైన్ కేంద్రాలు రోసాటామ్ విస్తృత పారిశ్రామిక నెట్‌వర్క్‌తో అనుసంధానమై పనిచేయడం వల్ల ఈ సంస్థ పరిశోధనతో పాటు పారిశ్రామిక అమలు సామర్థ్యం కలిగి ఉంది. ముఖ్యంగా కీలక ఖనిజాలు, బ్యాటరీ రీసైక్లింగ్, రేర్ ఎర్త్ ప్రాసెసింగ్, అధునాతన పదార్థాల అభివృద్ధి రంగాల్లో భారతదేశంతో భాగస్వామ్య అవకాశాలు పెరుగుతున్నాయి. మాస్కోలో 25 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 7 అంతస్తుల్లో ఉండే అతిపెద్ద అణుశక్తి మ్యూజియంను మంత్రి లోకేశ్ సందర్శించారు. సోవియట్ అణు ప్రాజెక్టు ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు విస్తరించిన ప్రదర్శనలు ఈ మ్యూజియంలో ప్రత్యేకం. మ్యూజియంలో ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, శాస్త్ర ప్రయోగశాలలు, గైడెడ్ టూర్లు ఉండటం వల్ల ఇది ప్రజలకు విజ్ఞానపరమైన అనుభవాన్ని అందిస్తోంది. 2023 నవంబరులో ప్రారంభమైన ఈ మ్యూజియం ఇప్పటికే విశేష ప్రజాదరణ పొందింది. విజ్ఞానం, చరిత్ర, సాంకేతికత సమన్వయ వేదికగా నిలుస్తోన్న ఈ మ్యూజియాన్ని 80 దేశాలకు చెందిన 35 లక్షల మందికి పైగా సందర్శించినట్లు నిర్వాహకులు లోకేశ్‌కు వివరించారు. ఒకేసారి 2100 మంది వరకు సందర్శకులను ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. మాస్కో ప్రభుత్వం, రోసాటామ్ స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా, శాంతిపూర్వక అణు వినియోగ విజయాలను కూడా సమగ్రంగా పరిచయం చేస్తోంది.

విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్‌బిషప్ మోస్ట్ రెవ. డాక్టర్ ప్రకాశ్ మల్లవరపుమృతిపై.. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రకాశ్ మల్లవరపు తుదిశ్వాస విడవడం ఎంతో బాధాకరమని లోకేశ్ పేర్కొన్నారు. విద్యావంతుడిగా, ఆధ్యాత్మికవేత్తగా ఆయన తన జీవితాన్ని క్రైస్తవ సమాజ సేవకు అంకితం చేశారని కొనియాడారు. విజయవాడ బిషప్‌గా, కడప బిషప్‌గా, ఏలూరు డయాసిస్ అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా, విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్‌బిషప్‌గా, శ్రీకాకుళం అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా డాక్టర్ ప్రకాశ్ మల్లవరపు విశిష్ట సేవలు అందించారని స్మరించుకున్నారు. ఆయన సేవలు కేవలం చర్చి పరిమితుల్లోనే కాకుండా సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాయని నారా లోకేశ్ పేర్కొన్నారు. ఆదర్శవంతమైన జీవనశైలి, వినయం, ప్రేమాభిమానాలతో పేదల సంక్షేమానికి కృషి చేసిన బిషప్‌గా ఆయన చిరస్మరణీయులుగా నిలిచిపోతారని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశ్ మల్లవరపు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నివాళులు అర్పించారు నారా లోకేశ్. ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని విమర్శించారు.

# సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరం

పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ లైన్ దాటి అధికారాన్ని ఉపయోగించరని, కానీ జగన్ రెడ్డి రోజూ లైన్ దాటుతారని చెప్పారు. సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరమని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతిరోజూ కూటమి నేతలు ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు.

ఏపీలో జగన్ అరాచక పాలన రాకూడదు..

ఏపీలో జగన్ అరాచక పాలన మళ్లీ రాకూడదంటే.. 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్' అని చాటి చెప్పాలని మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన 93శాతం స్ట్రైక్ రేటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని వ్యాఖ్యానించారు. నాడు పోలింగ్ బూత్ స్థాయిలో వెనకడుగు వేయకుండా జెండా పట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్త శ్రమ, ధైర్యమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలను మరిచిపోతే ఏ రాజకీయ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాగించలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోయే నాయకులందరి కోసం తాము కష్టపడాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదు..

గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదని మంత్రి పయ్యావుల హెచ్చరించారు. కార్యకర్తలు, నేతలు అలకలు వీడాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అలిగి పార్టీకి దూరమవ్వద్దని చెప్పారు. కొట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రాయలసీమ రాజకీయాల్లో అప్రమత్తత అవసరమని తెలిపారు. గొడ్డలి పార్టీపై నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనం ప్రభుత్వంలో ఉన్నామని నిద్రపోవద్దని చెప్పారు. టీడీపీ శ్రేణులు ఓటర్ లిస్ట్‌పై పట్టు సాధించాలని దిశానిర్దేశం చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఐదు నిర్ణయాలకు సంబంధించిన కీలక విషయాలను వెల్లడించారు. ఎస్ఐఆర్, నీట్-సీబీఎస్ఈ పరీక్షల వివాదం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల కష్టాలు, అణగారిన వర్గాల సమస్యల వంటి అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ఇండియా కూటమి తదుపరి సమావేశం తేదీని ఖరారు చేసినట్లు తెలిపారు.. ఎస్ఐఆర్, ఓట్ల లూటీ, ఎన్నికల అక్రమాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. నీట్, సీబీఎస్ఈ విద్యార్థులకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతులు సహా ఇతర సమస్యలపై చర్చకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం అత్యంత విషాదకరం

కూలిపోవడంతో లిక్విడ్ స్టీల్ కార్మికులపై పడటం వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధిత కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు .ప్రమాదంలో గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక సంస్థల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని వైఎస్ జగన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రమాద బాధితులు, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని విశాఖ జిల్లా, ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య చికిత్స అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో నెల్లూరు జిల్లా నుంచి కాశీయాత్రకు వెళ్తున్న ప్రైవేట్ బస్సు రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు భక్తులు మృతిచెందిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా నుంచి ఉత్తర భారతదేశ యాత్రకు బయల్దేరిన యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరగడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సంగం మండలానికి చెందిన ఇద్దరు, ఆత్మకూరుకు చెందిన ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఈ తీరని విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన, బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది సూచిస్తుంది. ప్రజాప్రతినిధులు, దౌత్యవేత్తలు, అంతర్జాతీయ మీడియా సమక్షంలో దేశం తన గళాన్ని విప్పే అరుదైన అవకాశం ఇది. ఈ వేదికల పరంగా చూస్తే జవహర్‌లాల్ నెహ్రూ, నరేంద్ర మోదీల ప్రస్థానాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది.

# సిఎం విజయ్‌తో చెస్ ఆడిన ప్రజ్ఞానంద..

ఆర్.ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. విన్సెంట్ కీమర్(జర్మనీ)పై అతడు గెలుపొంది నార్వే చెస్ టోర్నీ టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో సోమవారం తమిళనాడు సిఎం విజయ్‌ని సెక్రటేరియట్‌లో అతడు తన తల్లిదండ్రులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా సిఎం విజయ్ కాసేపు ప్రజ్ఞానందతో కలిసి సరదాగా చెస్ ఆడాడు. కొద్దిసేపే జరిగిన ఈ ఆటలో కొన్ని ఎత్తుల్లోనే సిఎం విజయ్‌కు ప్రజ్ఞానంద చెక్ పెట్టాడు. నార్వే చెస్ టోర్నీలో అద్భుతమైన విజయం సాధించిన ప్రజ్ఞానందను సిఎం అభినందించారు. అతడి ప్రదర్శనతో తమిళనాడు గర్విస్తోందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వం తరఫున రూ. 50 లక్షల చెక్కును రివార్డు అందించారు. అనంతరం ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. విజయ్ ఇంత బాగా చెస్ ఆడుతారని తాను ఊహించలేదని అన్నాడు. " ఆయన చెస్ ఆడతారని ఎవరూ చెప్పలేదు. ముఖ్యమంత్రి నన్ను చెస్ బోర్డు తీసుకురమన్నారు. బోర్డు మీద పావులు అమర్చి అప్పటికప్పుడు ఆట మొదలు పెట్టాం. ఆయన బాగా ఆడారు. చెస్ ఎప్పుడు ఆడతారని ఆయన్ను అడిగాను.. తన స్నేహితులతో అప్పుడప్పుడు ఆడతానని చెప్పారు. నేను గెలిచాను. కానీ, విజయ్ ఇంత బాగా ఆడతారని అస్సలు ఊహించలేదు" అని అన్నాడు. భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు ప్రజ్ఞానంద నార్వే చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచిన సంగతి తెలిసిందే. నార్వే చెస్ టైటిల్ గెలిచిన తొలి భారత ఆటగాడిగా ఆర్ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఈ నేపథ్యంలో సోమవారం తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్‌ని ప్రజ్ఞానంద తన తల్లిదండ్రులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రజ్ఞానందను అభినందించడమే గాక అతడితో సరదాగా చెస్ ఆడాడు. అతడి ప్రదర్శనతో తమిళనాడు గర్విస్తోందని పేర్కొన్న విజయ్ ప్రజ్ఞానందకు రూ. 50 లక్షల చెక్కును రివార్డుగా అందించారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను రెండుసార్లు ఓడించిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఓస్లో వేదికగా జరిగిన టోర్నీలో ప్రజ్ఞానంద ఫైనల్లో జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్‌ను మట్టికరిపించి చాంపియన్‌షిప్ కిరీటాన్ని కైవసం చేసుకున్నాడు. టోర్నీ ఆరంభంలో తడబడిన ప్రజ్ఞానంద చివరి దశలో అనూహ్యంగా పుంజుకున్నాడు. పదో రౌండ్ ప్రారంభానికి ముందు 15 పాయింట్లతో ప్రజ్ఞానంద ముందు వరుసలో నిలిచాడు. ఆఖరి రౌండ్‌లో విన్సెంట్ కీమర్‌ను ఓడించిన ప్రజ్ఞానంద నార్వే చెస్ టైటిల్‌ను తొలిసారి సొంతం చేసుకున్నాడు. ఇక నార్వే చెస్ టోర్నీ విజేతగా నిలిచిన ప్రజ్ఞానందకు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు అభినందించారు. ప్రపంచవ్యాప్త అస్థిరతల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖతో కుదిరిన అవగాహన ప్రకారం 'వాద్వానీ-ఏఐ' సంస్థ రూపొందించిన 'శిశు మాపన్ యాప్' ఆధారంగా అనుసంధానం జరుగుతుందని పేర్కొన్నారు.

## తెలుగు భాషా సేవలకు డా. డి. సత్యలతకు ప్రతిభ పురస్కారం



కాకినాడ జిల్లా,జగ్గంపేట.జూన్ 8 నేటి శుభోదయ:తెలుగు భాష పరిరక్షణ, సాంప్రదాయాల అభివృద్ధి, తెలుగు సంస్కృతి వికాసానికి విశేష కృషి చేస్తున్న జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకురాలు డా. డి. సత్యలతకు తెలుగు అభినందన ప్రతిభా పురస్కారం లభించింది.రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 7న నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సందర్భంగా ఈ పురస్కారాన్ని ఆమెకు ప్రదానం చేశారు. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య సేవలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆమె చేస్తున్న విశేష సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. చంద్రబాబుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది డా. సత్యలతను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్”




**కామాక్షి కాంప్లెక్స్ ఏరియాలో రోడ్లు డ్రైన్లు శుభ్రం చేసిన మున్సిపల్ సిబ్బంది”**

తాడేపల్లిగూడెం జూన్ 9 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::కామాక్షి కాంప్లెక్స్ పరిధిలో బుధవారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కమర్షియల్ క్లీనింగ్ డ్రైవ్ డిప్యూటీ ఇంజనీర్ పవన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ డ్రైవ్‌లో భాగంగా కాంప్లెక్స్ లోని అన్ని షాపులు, కామన్ కారిడార్లు, మెట్లు, పార్కింగ్ ప్రాంతం మరియు బయటి ఆవరణలో పేరుకుపోయిన దుమ్ము, చెత్తను పూర్తిగా తొలగించారు. ప్రొఫెషనల్ శానిటైజేషన్ మందులతో మొత్తం ప్రాంతాన్ని శుభ్రపరిచి, క్రిమిసంహారక మందులు చల్లి శుభ్రపరిచారు.వ్యాపారులకు, కొనుగోలుదారులకు అవగాహన కల్పిస్తూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం, కాంప్లెక్స్ శుభ్రంగా ఉంచడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని డిప్యూటీ ఇంజనీర్ పవన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మద్దాల మణికుమార్, రౌతు సోమరాజు, కర్రీ సత్యనారాయణ మరియు శానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరావు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కిషోరుల్లో చైతన్యం నింపిన వికాసం



పులిచెర్ల, జూన్ 9,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, కావేటిగారిపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వాణిశ్రీదేవి మాట్లాడుతూ, మే 1 నుంచి జూన్ 9 వరకు కిశోర బాలికలు, బాలురకు ఆరోగ్యం, పరిశుభ్రత, జీవన నైపుణ్యాలు, విద్య, కెరీర్ మార్గదర్శకత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. స్వర్ణ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయసులో వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయని అన్నారు. ప్రతి బాలిక ఉన్నత విద్యను అభ్యసించి స్వావలంబన సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంపై తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేయగా, ఐసీడీఎస్ సూపర్వైజర్లు విజయలక్ష్మి, సుహాసిని, ఏఎన్ఎం శోభారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గండేపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి




కాకినాడ జిల్లా,గండేపల్లి, జూన్ 9 నేటి శుభోదయ:గండేపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహం దిమ్మపై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది.స్థానికుల సమాచారం మేరకు, సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి సోమవారం రాత్రి అక్కడే పడుకుని ఉన్నట్లు గుర్తించారు. అయితే మంగళవారం మధ్యాహ్నం వరకు ఆయన లేవకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు గండేపల్లి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.మృతుడు తెల్ల రంగు చారల చొక్కా, ఎరుపు రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. తెల్ల వెంట్రుకలతో గుండు తల కలిగి ఉన్న ఈ వ్యక్తి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.మృతుడి ఆచూకీ లేదా కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# “చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు వైసిపి ఇన్చార్జ్ వడ్డి రఘురాం నాయుడు”



తాడేపల్లిగూడెం జూన్ 9 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::;తాడేపల్లిగూడెం నియోజకవర్గం గమిని ఫంక్షన్ హాల్ నందు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో తాడేపల్లిగూడెం వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గత రెండేళ్ళు గా తెలుగుదేశం పార్టీ నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలు, అరాచకాలు, ఆర్థిక దుర్వినియోగం పై ఫోటోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ముందు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను వడ్డీ రఘురామ్ నాయుడు సందర్శించి పరిశీలించారు. అనంతరం నల్ల బెలూన్లను ఎగురవేసి తమ నిరసనను వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు, యువత మరియు వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా మాట్లాడారు.కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం ఎత్తారు. కూటమి ప్రభుత్వ రెండు సంవత్సరాల పాలనలోని వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు, వేధింపులు మిన్నంటాయని ఆవేదన వ్యక్తం చేశారు.యువతకు అబద్ధపు హామీలు ఇచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు.మెగా డీఎస్సీ మోసం చేసి డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను ఎలా మోసం చేశారో ప్రజలకు వివరించారు.అన్నదాతలకు వెన్నుపోటు పొడిచి రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్నదాతల మోసం చేసిన కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు.లా అండ్ ఆర్డర్ విఫలం చేసి ప్రభుత్వం చట్టాన్ని, పోలీసు వ్యవస్థను చేతుల్లోకి తీసుకుని, ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేయిస్తూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం అవినీతి, అరాచకాలు మాత్రం పరాకాష్టకు చేరాయి అని ధ్వజమెత్తారు.ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదు. ఆసరా కోసం ఎదురుచూసే వృద్ధులను, నిరుపేదలను నట్టేట ముంచి, వారి వెన్నుపోటు పొడిచారు అని అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తున్న ఈ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలంతా గమనిస్తున్నారు అని రఘురామ్ నాయుడు గారు అన్నారు..రౌండ్ టేబుల్ సమావేశపు పద్ధతిన జరిగిన చర్చవేదికలో గత జగన్మోహన్ రెడ్డి గారి పాలనలో రెండేళు కోవిడ్ ప్రభావము ఉన్న ? 3.38 లక్షల కోట్ల జరిగిన ప్రయోజనాలు, అభివృద్ధి ఈ రెండేళ్ల లోనే 3.47 లక్షల అప్పు చేసినా ఎందుకు జరగలేదు అని చర్చించారు. అప్పులు చేయకుండా సంపద సృష్టించి సంక్షేమాన్ని, అభివృద్ధి జరుపుతానని చెప్పిన 40 ఇయర్స్ ఇండస్ట్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, 24 నెలల లోనే 3.47 వేల కోట్లు అప్పు చేసినా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదు అని ఆగ్రహం వ్యక్తం చేసారు.5 ఏళ్ళ లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని సాలీనా 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని ఉద్యోగం రాని యువతకు నెలకు 3000/- నిరుద్యోగ భృతి ఇస్తామని రెండేళ్ళైనా ఇవ్వలేదు. మెగా ఋజ అని చెప్పి క్రీడాకారుల కోటాలో, వివిధ కేటగిరీ ల్లో అక్రమాలకు పాల్పడి ప్రతిభ కల నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారని యువకులు ఆవేదన చెందారు.ఆడబిడ్డ నిధి ఊసే లేదని, 0 వడ్డీ కి తూట్లు పొడిచారని మహిళలు ప్రభుత్వ పనితీరుని తూర్పార పట్టారు.విత్తనాలు లేవు, ఎరువులు లేవు, మద్దతు ధర లేదు, కొనుగోళ్లు లేవు. కేంద్ర పథకం తో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పేరుతొ 20,000 ఇస్తామన్న రెండేళ్లుగా ఇచ్చిన దెంత? ఏరైతుకి కేంద్రమిచ్చిన ?6000, కొందరికి కేంద్ర పథకం తో కలిపి రెండో సంవత్సరం లో 12000/- నుండి 18000/- మాత్రమే ఇచ్చి లక్షలాది మంది రైతులకు అనర్హులుగా చేసి ఎగ్గొట్టారు.అన్ని వర్గాల వారికి శఠగోపం పెట్టిన కూటమి పాలన కు రోజులు దగ్గర పడ్డాయని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఎన్నిక ఏదైనా కూటమికి తిలోదాకాల తర్పణం విడవడం ఖాయమని హెచ్చరించారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తూనే, ప్రజల సమస్యల పరిష్కారమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా పెంటపాడు మండల పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షులు చిట్టూరి భాపన్న,పట్టణ మహిళా అధ్యక్షురాలు మండా పద్మావతి,మాజీ టౌన్ అధ్యక్షులు గుండుబోగుల నాగు, జిల్లా కార్యదర్శి గుండుమొగుల బలుసులరావు, మరియు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, పంచాయతీ ప్రెసిడెంట్ లు, వార్డు అధ్యక్షులు, మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

**- మీడియా చిట్ చాట్ లో తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



ఖమ్మం, నేటి శుభోదయ ::: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ‘ప్రజా దర్బార్’ విజయవంతం కావడమే నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.

**- 14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం**

**24వేల పైచిలుకు దరఖాస్తులు**

పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుండి 30 రోజులుగా ‘ప్రజల వద్దకే ప్రభుత్వం’ అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

**- భూ భారతి చట్టంతో**

**సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**- ఆధునిక డిజిటల్ సర్వే సాగులో**

**ఉన్న వారికే భూమి పట్టాలు**

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

**- నిర్ణీత కాలపరిమితిలోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు**

ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**- ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా సానుకూలంగా తీసుకుని తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదని, అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈ ప్రభుత్వం ఖచ్చితంగా మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు.. ఏవైనా సరే ఓటరు స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## కొమరవోలు డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



గుడివాడ, జూన్ 9 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కొమరవోలు డ్రైనేజీ పూడికతీత పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం గుడివాడ మండల పరిధిలోని కొమరవోలు డ్రైనేజీ పూడికతీత పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా గుడివాడ ప్రధాన రహదారికి సమీపంలో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి కావడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని ప్రశ్నించగా, రాబోయే రెండు వారాల్లో పనులను పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, 2013 సంవత్సరం తర్వాత కొమరవోలు డ్రైనేజీకి పూడికతీత పనులు చేపట్టడం ఇదే తొలిసారని కలెక్టర్‌కు వివరించారు.అనంతరం శేరిదింటకుర్రు సమీపంలో ప్రొక్లైన్ యంత్రాలతో కొనసాగుతున్న పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. డ్రైనేజీ కట్ట లోపల దిగువన విద్యుత్ స్తంభాలు ఉండటం వల్ల పూడికను తీసి కట్టపై వేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో పనుల పురోగతి మందగిస్తోందని అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, విద్యుత్ స్తంభాల లైన్‌ను కట్టపైకి మార్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకుని పూడికతీత కార్యక్రమాన్ని వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్, ఇంజనీరింగ్ అధికారులు కుమార్, చిరంజీవి ఉన్నారు.

## గుడివాడలో వామపక్షాల ఆందోళన

**- పెట్రో, డీజిల్, గ్యాస్ ధరల తగ్గించాలని డిమాండ్**

**-విజయవాడ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద రాస్తారోకో - ట్రాఫిక్ స్తంభన**



గుడివాడ, జూన్ 9 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పెంచిన పెట్రోల్, డీజిల్, సీఎన్జీ, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం గుడివాడలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. వామపక్ష శ్రేణులు పట్టణంలో ర్యాలీ చేసి విజయవాడ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది.

పెరిగిన నిత్యావసర ధరలు, పెట్రో ఉత్పత్తుల ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు.సిపిఎం సిపిఐ నాయకులు ఆర్ సి పి రెడ్డి, గూడపాటి ప్రకాష్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెట్రో, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు.

“మోడీ ప్రభుత్వం పన్నుల రూపంలో 65 లక్షల కోట్లు ప్రజల నుంచి వసూలు చేసిందన్నారు. పెట్రో, డీజిల్‌లో రాష్ట్రం 30-35 రూపాయలు, కేంద్రం 20 రూపాయలు పన్ను వసూలు చేస్తుందని మండిపడ్డారు.యుద్ధ సమయంలోనూ గ్యాస్, పెట్రో, డీజిల్ కొరత లేదని కేంద్రమే చెప్పిందని, మరి రేట్లు ఎందుకు పెంచుతున్నారని నిలదీశారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై మౌనంగా ఉన్నాయని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో 10 వామపక్ష పార్టీల పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టామని, పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సమరం, ఐద్వా కార్యదర్శి రజిని, ప్రజా సంఘాల నాయకుడు పంతగాని సురేష్, వామపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
-వలివర్తిపాడులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజా దర్బార్ - గ్రామస్తుల అర్జీలపై అధికారులతో చర్చ
-రూరల్ మండలంలో రెండేళ్లలో రూ.37.86 కోట్లు... వలివర్తిపాడులో రూ.4.84 కోట్ల అభివృద్ధి పనులులి
పి. జె. ఆర్, ఎస్. ఎల్ లో అర్జీల నమోదు- జవాబుదారీతనంతో పరిష్కరిస్తాం:ఎమ్మెల్యే
-సూపర్ సిక్స్ హామీలు 90 శాతం హామీలు అమలు.
-కొద్ది రోజుల్లో తల్లికి వందనం నిధులు జమ.
-విధ్వంసం వ్యవస్థల నాశనమే వైసిపి ఎజెండా.
=అభివృద్ధి చెందిన రోడ్లపై రయ్ రయ్ మంటూ రాకపోకలు.-బ్రిడ్జి గేమ్ కు, పేకాటకు తేడా తెలియని సైకోలు వైసీపీ వాళ్ళు:కూటమి నేతలు
-చదువుకోని మూర్ఖుడు గుడివాడను నాశనం చేస్తే.. చదువుకున్న రాముడు నాయకత్వంలో అభివృద్ధి పథంలో గుడివాడ కూటమి నేతలు



గుడివాడ రూరల్, జూన్ 9 (అజయ్ నారగాని - నేటి శుభోదయ,) ఎన్నికల్లో ప్రతి ఇంటి తలుపు తట్టి గుర్తించిన ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా జరుగుతాయని, కొన్ని పనులు కొద్దిపాటి ఆలస్యమైన ఆందోళన వద్దని ఆయన అన్నారు.గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం సాయంత్రం ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులతో కలిసి దర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు తమ సమస్యల అర్జీలను అందజేసి వివరించారు. అర్జీ సమస్యలను సవివరంగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రాము, దర్బార్‌లో పాల్గొన్న అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో 100 అర్జీలను ఎమ్మెల్యే అందుకున్నారు.ప్రజా దర్బార్‌లో వచ్చే అర్జీలు జవాబు దారీతనంతో పరిష్కారం అయ్యేలా పీజేఆర్ఎస్‌లో నమోదు చేస్తామని,కొన్ని సమస్యలు ఆలస్యమైనా పరిష్కారం పక్కా అని ఎమ్మెల్యే రాము ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామ గ్రామాన ప్రజా దర్బార్లు నిర్వహించి ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుంటున్నామని ఆయన తెలిపారు.ఉముందుగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయని, ఒకప్పుడు రోడ్లపై తిరగాలంటే కష్టంగా ఉండేదని, ఇప్పుడు రయ్ రయ్ మంటూ రాకపోకలు సాగుతున్నాయని పేర్కొన్నారు. గత పాలకులు ఎన్నికలప్పుడే గ్రామాలకు వచ్చేవారని, కానీ కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే నియోజకవర్గంలోని 66 గ్రామాల్లో అనేకసార్లు పర్యటిస్తూ అభివృద్ధి పనుల్లో పాల్గొంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తోందని తెలిపారు.రెండేళ్ల కూటమి పాలనలో రూరల్ మండలానికి రూ.37.86 కోట్లు, ఒక్క వలివర్తిపాడు గ్రామానికే రూ.4.84 కోట్ల అభివృద్ధి పనులు చేశామని గర్వంగా చెప్పారు. గ్రామంలో 20 ఏళ్లలో రాని నిధులు రెండేళ్లలోనే మంజూరు చేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. 5 ఏళ్ల జగన్ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపించిందని, విధ్వంసమే వైసీపీ నేతల ఎజెండాగా వ్యవస్థలను సర్వనాశనం చేశారని విమర్శించారు. ఆర్థిక వెసులుబాటుతో సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామని, ఇప్పటికే 90 శాతం హామీలు అమలవుతున్నాయని, కొద్ది రోజుల్లో తల్లికి వందనం నిధులు జమ కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. సమర్థులు ఉంటే పాలన ఎలా సాగుతుందో సీఎం చంద్రబాబు చేసి చూపిస్తున్నారని, కూటమి పాలన గొప్పతనం గురించి ప్రజల ముందు గర్వంగా చెబుతున్నామని అన్నారు.ఈ కూటమి నాయకులు మాట్లాడుతూ చదువుకోని మూర్ఖుడు గుడివాడను నాశనం చేస్తే, చదువుకున్న రాముడు నాయకత్వంలో గుడివాడ అభివృద్ధి పథంలోకి వెళ్తోందని అన్నారు.ఏపీ ఎస్ డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, తహాశీల్దార్ ప్రసాద్,ఎండిఓ విష్ణుప్రసాద్,గుడివాడ టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, గుత్తా చంటి,చేకూరు జగన్మోహన్రావు,కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, నేరుసు కాశి, లోయ విజయ్,డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు,డిప్యూటీ తహసిల్దార్ కిరణ్ కుమార్ పంచాయతీరాజ్ ాజు సూరిబాబు,=ఔా ాజు కిస్మత్ రాణి,గ్రామ నాయకులు గ్రామపాటి ప్రెసిడెంట్ దొండపాటి మహేష్, అనంత్, రేమల్లి రజిని, రాము, ఆనంద్, బ్రహ్మయ్య, పంది నాగరాజు, లీలా సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సందీప్, పవన్, వజ్ర కిరణ్,ఇరిగేషన్ ,డ్రైనేజీ,తదితర ప్రభుత్వ శాఖల అధికారులు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు ప్రజా దర్బార్ లో పాల్గొన్నారు.



## రికవరీలతో ఉపాధి సిబ్బంది భవితవ్యం ప్రశ్నార్థకం




పులిచెర్ల, జూన్ 9,(నేటి శుభోదయ) : ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకల ఆరోపణలు ఉపాధి సిబ్బంది జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సెంట్రల్ విజిలెన్స్ కమిటీ నిర్వహించిన విచారణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో పులిచెర్ల, రొంపిచర్ల మండలాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి సుమారు రూ.40 లక్షల మేర రికవరీలు విధిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. పులిచెర్ల మండలంలోనే 15 మంది ఉపాధి సిబ్బంది రికవరీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడగా, వారిలో కొందరిపై లక్షల రూపాయల భారం పడినట్లు సమాచారం.రికవరీలకు ముందు సిబ్బంది నుంచి సంజాయిషీలు స్వీకరించినప్పటికీ అధికారులు సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. అనంతరం పలువురు చేసిన ప్రయత్నాలు, రాయబారాలు కూడా ఫలించకపోవడంతో రికవరీలు తప్పనిసరి అయ్యాయని చెబుతున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో ఉపాధి సిబ్బంది ఉద్యోగాల రెన్యువల్ ప్రక్రియ జరుగుతుంది. అయితే ఈసారి రికవరీలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగాల రెన్యువల్ నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో రెండు నెలలుగా జీతాలు కూడా అందకపోవడంతో సిబ్బంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉద్యోగ భద్రత కోసం కొందరు ఇంట్లో ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రికవరీ మొత్తాలను సమకూర్చుకుంటున్నట్లు తెలిసింది. పనులు నిర్వహించిన సిబ్బందే ఇప్పుడు ఆర్థిక భారం మోస్తుండగా, నిర్ణయాలు తీసుకున్నవారు మాత్రం బాధ్యతలకు దూరంగా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రికవరీలు చెల్లిస్తేనే ఉద్యోగాల రెన్యువల్ జరిగే అవకాశం ఉండటంతో ఉపాధి సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రత, త్రాగునీటి ఏర్పాట్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలి



విజయవాడ, జూన్ 9 (నేటి శుభోదయ):-ఇంద్రకీలాద్రి పుణ్యక్షేత్రంలో పరిసరాల పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యాలు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాల కల్పన జరుగాలని దేవస్థానం ఈఓ వికె శీనా నాయక్ ఆదేశించారు.మంగళవారం ఉదయం వివిధ ప్రాంతాలు పరిశీలించిన ఆయన సిబ్బందిని ఆదేశించారు. శివాలయం నుండి పూజా మండపాలకు వచ్చే మార్గంలో అపరిశుభ్రంగా ఉండటంతో, వెంటనే శుభ్రం చేయించాలని సూపర్ వైజర్ ను ఆదేశించారు.కొండపై వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మంచి నీటి పంపులను పరిశీలించి చుట్టు ప్రక్కల ఎల్లపుడు శుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు.చండీ హోమం ప్రదేశం లో భక్తులకు అనుకూలంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రధాన ఆలయంలో ఓం కనకదుర్గాయనమహా అనే అమ్మవారి నామం నిరంతరం మైక్ లో వినిపించాలని, దర్శనం అయి బయటకు వెళ్తున్న శ్రీ దుర్గా దివ్య దర్శనం (రూ. 500/-)భక్తులకు ఉచిత లడ్డు ఇక్కడ కలెక్ట్ చేసుకోవచ్చని మైక్ ద్వారా తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని శీనా నాయక్ ఆదేశించారు

## పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా నేతాజీ బ్రిడ్జి, రాణిగారి తోట, కృష్ణలంక ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా కృష్ణలంకలోని రివర్ ఫ్రంట్ పార్కులో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను అక్కడున్న ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఇటీవల నగరంలో అధిక వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో పరిశుభ్రత నిర్వహణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడా లోపాలకు తావు లేకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కృష్ణలంక రివర్ ఫ్రంట్ పార్కులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని కామన్ యోగా ప్రోటోకాల్‌కు అనుగుణంగా యోగాసనాలు చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమాలతో పాటు యోగా పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు స్థాయి నుంచి నగర, జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు ఈ కార్యక్రమాలు విస్తరించనున్న నేపథ్యంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం రాణిగారి తోటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహార నాణ్యత, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అలాగే త్రాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) రామారావు, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ గోపాల్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో యోగాను తప్పనిసరి చేయాలి.వేముల శ్రీనివాస్




విజయవాడ, జూన్ 9 (నేటి శుభోదయ):- విద్యార్థులకు యోగా కేవలం శారీరక ఆరోగ్యానికి, మానసిక భావోద్వేగ అభివృద్ధికే కాకుండా ఏకాగ్రత కూడా పెంచుతుందని, యోగా, ధ్యానం మనసును ప్రశాంతంగా ఉంచి చదువుపై దృష్టి కేంద్రీకరించడంలో సహాయపడి జ్ఞాపకశక్తి మెరుగుపడెలా చేస్తుందని ఎన్.ఎస్.యు.ఐ. స్టేట్ కోఆర్డినేటర్ వేముల శ్రీనివాస్ అన్నారు.క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ మెరుగై నేర్చుకునే సామర్థ్యం పెరిగి ఒత్తిడి మరియు ఆందోళన తగ్గుతాయనీ,ముఖ్యంగా విద్యార్థులకు పరీక్షల సమయంలో వచ్చే టెన్షన్‌ను తగ్గించి మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.కండరాలు, ఎముకలు బలపడి శరీరం మరింత చురుకుగా ఉండి శారీరక దృఢత్వం పెరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు.ఎక్కువసేపు కూర్చుని చదివే విద్యార్థులకు వెన్నునొప్పి, మెడనొప్పి వంటి సమస్యలు తగ్గి సరైన భంగిమ ఏర్పడుతుందనీ,యోగా ద్వారా మనస్సు స్థిరంగా ఉండి, సానుకూల ఆలోచనలు పెరిగి ఆత్మవిశ్వాసం పెరుగుతుందనీ,ప్రతిరోజు యోగా చేయడం వల్ల మంచి నిద్ర పట్టి మరుసటి రోజు చదువులో ఉత్సాహం, చురుకుదనం పెరిగి నిద్ర నాణ్యత మెరుగుపడుతుందని అన్నారు.ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సమయపాలన, స్వీయ నియంత్రణ పెరిగి క్రమశిక్షణ అలవడుతుందనీ,యోగా విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి ఎంతో ఉపయోగకరమైన సాధనమని ప్రతిరోజూ 15--30 నిమిషాలు యోగా సాధన చేస్తే చదువులో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చు అని శ్రీనివాస్ అన్నారు.

## పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ బాధ్యత ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, జూన్ 9 (నేటి శుభోదయ):-పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఎల్.ఓ.సిలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు అందజేశారు.ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడి గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాసరావుకు రూ.1,02,338ల విలువైన ఎల్ఓసీ, ఇబ్రహీంపట్నానికి చెందిన బురద శ్రీరామ్‌కు రూ.2,24,000ల విలువైన ఎల్ఓసీ అందజేశారు. మొత్తం ఇద్దరు లబ్ధిదారులకు రూ.3,26,338ల విలువైన ఎల్ఓసీలను అందజేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సీఎంఆర్ఎఫ్ పెద్ద అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణప్రసాదు సూచించారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఎల్ఓసీలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కార్పొరేట్ వైద్యం పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో సాయం అందించి ఆదుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు చేర్చాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక కార్యక్రమం




విజయవాడ, జూన్ 9 (నేటి శుభోదయ):-12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం సంగమం వద్ద మంగళవారం ఉదయం యోగా సెషన్స్ నిర్వహించారు. కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమీషనర్ పాల్గొన్నారు.యోగా గురువు జనార్దన్ సిబ్బందికి యోగాసనాలు, ప్రాణాయామం గురించి అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక దుస్తుల్లో యోగా సాధన చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయాలని, యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు.పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేపడతామని తెలిపారు.

## “విశాఖ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఘోర ప్రమాదం పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలుగుదేశం సీనియర్ నాయకులు పసల కొండ”




తాడేపల్లిగూడెం జూన్ 9 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: విశాఖ ఉక్కు కర్మాగారం లోని స్టీల్ మెల్ట్ షాపు (ఎస్ఎంఎస్ 1)స్టీల్ ప్లాంట్ లో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని చనిపోయిన మృతులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీనియర్ తెలుగుదేశం నాయకులు పసల కొండ అన్నారు. బుధవారం పసలకొండ మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ ఈరోజు ఉదయం విశాఖపట్నం చేరుకున్నారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ విశాఖపట్నం చేరుకున్నారని జరిగిన సంఘటన ఎవరు తీర్చలేరని సంఘటన తెలిసిన వెంటనే అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ అక్కడికి చేరుకొని క్షతగాత్రులను హాస్పటల్లో చేర్పించారన్నారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నియమించిన త్రీ మెన్ కమిటీ నివేదిక అందిన తర్వాత ఈ ప్రమాదం కారణం అయిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని, మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా తోపాటు మృతి చెందిన కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. ఇటువంటి కష్ట టైంలో పార్టీలకతీతంగా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. సహాయ సహకారాలు అందించినప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం తరపున నా ధన్యవాదాలు తెలియజేస్తూ మరొకసారి మృతి చెందిన ఉద్యోగులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు..- రెండేళ్ల కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలి

- విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రౌండ్ టేబుల్ సమావేశం..




( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజల్ని వెన్నుపోటు పొడిచిన సందర్భంగా “వెన్నుపోటుకు రెండేళ్ళు” పేరుతో “రౌండ్ టేబుల్ సమావేశం మాధవదార,వుడా కోలని గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్లో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కె.కె రాజు వారి ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నల్ల బెలూన్లు ఎగురవేశారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి దివంగత నేత డా” వై.యస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పులా మాల వేసి నివాళులర్పించారు.

ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం,సతీష్ వర్మ,పేడాడ రమణి కుమారి,మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,ప్రచార విభాగం జోన్-1 ప్రెసిడెంట్ రవి రాజు,ఎస్ ఈ సీ సభ్యురాలు పీలా వెంకటలక్ష్మీ,మాజీ కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ,కె.అనిల్ కుమార్ రాజు, అల్లు శంకరరావు,వావిలపల్లి ప్రసాద్,బర్కత్ అలీ,సేనాపతి అప్పారావు,మువ్వల పోలారావు, దల్లి రామక్రిష్ణరెడ్డి,వార్డు అధ్యక్షులు పైడి రమణ,బొడ్డేటి కిరణ్, బలిరెడ్డి గోవింద్, కె.సుకుమార్, డొప్ప శ్రీను,ఐ.రవికుమార్,వేణు,మెట్ట దమయంతి,కడితి చిరంజీవి,బల్లా శ్రీనివాసరావు,జక్కంపూడి



సత్యనారాయణ, రాష్ట్ర, జోనల్, జిల్లా, నియోజకవర్గ నాయకులు తాడి జగన్నాథరెడ్డి,అంబటి శైలేష్,యం. సునీల్, బాణాల తరుణ్, బోగవల్లి గోవింద్,ఆడారి దివ్యకళ, తిరుమలరావు, పద్మశేఖర్, తుళ్ళి చంద్రశేఖర్, సాడి కేశవ్,కర్రి రామారెడ్డి,నీలి రవి,మార్కండేయులు, కరణం క్రిష్ణ,కె.చిన్న,పి. ఈశ్వరి,సబ్బవరపు శ్రీను,కోడూరు సత్యనారాయణ, మెరువ గణేష్,శ్రీనివాసరెడ్డి, కోడూరి సుశిల,వార్డు పరిశీలకులు షేక్ బాబ్జి,రాఘవులు, బద్రి,సీపాన రాము,నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు మువ్వల సంతోష్,పొన్నాడ అప్పారావు మాస్టర్, హరిపట్నాయక్,హరికృష్ణ,గుదే రాజు,భాద శ్రీను,తాటిపూడి రత్నం,సొండి సురేష్, సుబ్బారావు, బిలాల్, లక్ష్మణరావు, కోట్యాడ సూర్య,అనిల్ శర్మ,సచివాలయం అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు, మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో :కూటమి' అఖండ విజయం సాధించేలా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి..'

**- జనశ్రేణుల రెట్టించిన ఉత్సాహంతో విజయవంతమైన జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనం.. - పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే, జనసేన పార్టీని ముందుకు తీసుకు వెళ్దాం... ఎమ్మెల్యే :బత్తుల' - సభలో అందర్నీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించిన 'నా సేన కోసం నా వంతు' రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజానగరం మండలం పరిధిలోని రాయల్ కన్వెన్షన్ హాల్ నందు జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో అత్యంత విజయవంతం అయ్యింది. నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, మరియు జనసైనికులు ఈ సమావేశంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధి, మరియు రాబోయే రాజకీయ వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటామని, వారికి ప్రభుత్వంలో, పార్టీలో తగిన గుర్తింపుతో పాటు కీలక బాధ్యతలు అప్పగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన, రాజకీయ లక్ష్యాల కోసం జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో భాగంగా గ్రామ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కమిటీల పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారుద్దాం. తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ లతో క్షేత్రస్థాయిలో పూర్తి సమన్వయం కోసం ప్రత్యేక 'సమన్వయ కమిటీల' ను ఏర్పాటు చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించేలా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా.. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. జనసేన పార్టీ సిద్ధాంతాల ప్రకారం అన్ని కులాలకు, వర్గాలకు రాజకీయాధికారంలో మరియు ప్రభుత్వ పథకాల్లో సమాన ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. రాజానగరం నియోజకవర్గ పరిధిలోని పుష్కరాల ఘాట్ల ఆధునీకరణ, అంతర్గత రహదారులు ( రోడ్లు), డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, మరియు ప్రముఖ ఆధ్యాత్మిక ఆలయాల అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.నాడు జనసైనికులు చేసిన నిరంతర పోరాటాల ఫలితమే నేడు మనం సాధించిన ఈ చారిత్రాత్మక గెలుపు. అధికారం వచ్చింది కదా అని అలసత్వం వహించకుండా, అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను ప్రతి పేదవానికి అందించడమే మన కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బలరామకృష్ణ అన్నారు.ఈ సమావేశంలో మండల, నియోజకవర్గ స్థాయి జనసేన ముఖ్య నేతలు, వీరమహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే జాతీయ రహదారి కూడళ్లను అభివృద్ధి చేయాలి..

**ఈ నెల 25 నాటికి సైన్ బోర్డ్ లు ఏర్పాటు వేయాలి**

**వి ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ న్ తేజ్ భరత్, ఐ ఏ ఎస్ .,**




( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే ప్రధాన రహదారులు జాతీయ రహదారినీ కలిసే కూడళ్లను అభివృద్ధి చేయాలని వి ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ న్ తేజ్ భరత్, ఐ ఏ ఎస్ ., అధికారులను ఆదేశించారు. మంగళవారం వి ఎం ఆర్ డి ఏ సమావేశ మందిరంలో ప్రణాళిక, ఇంజనీరింగ్, జీవీఎంసీ, ఎన్ హెచ్ విభాగం, రహదారుల, భవనాల శాఖ కు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణ మార్గాల్లో ప్రధానంగా జాతీయ రహదారులకు కనెక్ట్ అయ్యే కూడళ్ల వద్ద సూచికల ఈ నెల 12 నాటికి సిద్ధమవుతున్న తరుణంలో నగరం నుంచి ఎయిర్ పోర్టుకు ఈ ప్రధాన రహదారుల మీదుగా పయనించే విమాన ప్రయాణికులు ఎలాంటి అవరోధాలు లేకుండా అనుకున్న సమయానికి చేరుకునేలా రహదారులపై స్పష్టంగా కనిపించేలా సైన్ బోర్డ్ లను ఏర్పాటును ఈ నెల 25 నాటికి సంబంధిత శాఖలు పూర్తి చేయాలని, అన్ని ప్రాంతాలకు చెందిన వారు కూడా విమాశ్రయానికి ఎటువంటి అవరోధాలు లేకుండా వేగవంతంగా చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ శ్రీ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారిణి శ్రీమతి దివ్యలత, ఓ ఎస్ డి కృష్ణా నాయక్, పర్యవేక్షక ఇంజనీర్లు మధుసూదన రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీ సుధీర్, శ్రీ దుర్గా ప్రసాద్, శ్రీ రామరాజు, న్ హెచ్ డిప్యూటీ మేనేజర్ గోపికృష్ణ, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజినీర్ జాన్ సుధాకర్, జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణ రాజు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ మృతులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి..!!




( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) స్టీల్ ప్లాంట్లో ఘోర ప్రమాదం లో మృతి చెందిన 9 మంది కార్మికులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, మృతులు కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని, ప్రమాద కారణాలను జ్యుడీషియల్ ఎంక్వేరీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తేదీ 9-6-2026 సాయంత్రం 6:30 కి విశాఖ రైల్వే స్టేషన్ వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మృతులకి శ్రద్ధాంజలి ఘటిస్తూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే.రహిమాన్ ప్రసంగిస్తూ స్టీల్ ప్లాంట్ గోర ప్రమాదంలో మృతి చెందిన 9 మంది కార్మికులకు కోటి రూపాయలు చొప్పున కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఏదో రకంగా ప్రైవేటీకరణ చేయాలని ఉద్దేశంతో పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు పెట్టడంలో శబ్ద వహించకపోవడమే ప్రమాదాన్ని కారణం అన్నారు. ఈమధ్యకాలంలో 6,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం,2,000 మంది పర్మినెంట్ కార్మికులకు విఆర్ఎస్ ఇవ్వడం మ్యాన్ పవర్ తగ్గించి ఉన్న కార్మికులపై పని భారాన్ని పెంచడం మరొక కారణం అన్నారు. స్టీల్ ప్లాంట్లో ఇటువంటి ఘోర విపత్తు ఎన్నడూ జరగలేదన్నారు. ప్రమాదంపై జుడిషియల్ ఎంక్వయిరీ నిర్వహించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని తెలియజేశారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అత్తిలి. విమల పి.చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎం. పైడ్రాజు జిల్లా కార్యవర్గ ఎం.మన్మధరావు,ఎన్.నాగభూషణం రావు, ఆర్. శ్రీనివాసరావు సమితి సభ్యులు సిహెచ్.కాసుబాబు,గుడాల. రాంబాబు వై.రాంబాబు,కాసుల. రెడ్డి,న్ .అప్పన్న వి.నల్లయ్య ఏ. రవి, కొమర.సందీప్, భానుమతి కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

**విశాఖ స్టీల్ ప్లాంట్లో ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు తక్కువ మంది కార్మికులతో ఎక్కువ లాభాలు సాధించాలనే యాజమాన్యం యావే**

- ప్రమాదాలకు కారణం అంటున్న కార్మిక సంఘాలు

విశాఖపట్నం, నేటి శుభోదయ ::: విశాఖపట్నం రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ ( ఆర్ఐఎన్ఎల్ ) యాజమాన్యం నిర్లక్ష్యానికి విశాఖ స్టీల్ ప్లాంట్ లో మరోమారు పెను ప్రమాదం చోటుచేసుకుందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ప్రాథమికంగా అందించిన సమాచారం ప్రకారం 8 మంది చనిపోయారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.అడపా దడపా విశాఖ ఉక్కులో ప్రమాదాలు జరుగుతున్నా లోపాలను సరిదిద్దడంలో యాజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని తాజా గా జరిగిన ప్రమాదం బట్టి స్పష్టంగా అర్థమవుతోంది.కర్మాగారంలో భద్రతా లోపాలు, సిబ్బంది కొరత, తగిన తర్ఫీదు పొందని కాంట్రాక్ట్ కార్మికులతో, కాలం చెల్లిన విడిభాగాలు, తాత్కాలిక మరమత్తులతో నేడు ప్లాంటు నిర్వహించడతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అనే నినాదం తో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నిరంతర ఉద్యమం మేరకు పలువురి ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖలో స్టీల్ ప్లాంట్స్ స్థాపన జరిగింది.1991 నుండి రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్, విశాఖపట్నం పేరుతో ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తుల ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఈ స్టీల్ ప్లాంట్ మునుగడే ప్రశ్నార్ధకంగా మారింది. కార్మికుల్లో, ఉద్యోగుల్లో సంస్థ ప్రైవేటీకరిస్తారనే భయాలు తొలగిపోలేదు. మరోపక్క ఎప్పటికప్పుడు జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం జరిగిన ఘోర దుర్ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.విశాఖ ఉక్కు కర్మాకారంలోని స్టీల్ ప్లాంట్ మెల్ట్ షాప్ (ఎస్ యం యస్-1 ) లో హఠాత్తుగా దాదాపు 1600 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రతతో సలసల మరిగే 150 టన్నుల ఉక్కు ద్రవాన్ని తరలిస్తున్న లాడిల్ భారీ శబ్దంతో ఒక్కసారిగా పేలిపోవడంతో పెను ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడికక్కడే ఎనిమిది మంది కార్మికులు తప్పించుకోలేక సజీవ దహనం అయ్యారు. అనేకమంది తీవ్ర గాయాలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ విశాఖపట్నం లో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్టీల్ ప్లాంట్లో ఇప్పటి వరకు అనేక ప్రమాదాలు చోటుచేసుకుని వందలాది మంది కార్మికులు ప్రమాదాల్లో సమిధులయ్యారు. ఈ ప్రమాదాల కారణంగా ఉక్కు పరిశ్రమకు దాదాపు 20 వేల కోట్ల రూపాయలు నష్టం జరిగిందని అంచనా . వీటిని ఒకసారి లోతుగా పరిశీలిస్తే స్టీల్ ప్లాంట్లో భద్రత ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో అవగతమవుతుంది . దాదాపు 15 సంవత్సరాల క్రితం ప్లాంట్లో వరుస ప్రమాదాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఆనాడు పరిశ్రమల శాఖ డైరెక్టర్ ప్రత్యేక అధ్యయనం జరిపి, స్టీల్ ప్లాంట్లో ప్రమాదాలు జరగకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తూ యజమాన్యానికి నివేదిక అందించారు. నివేదిక ను అనుసరించి తగు చర్యలు సకాలంలో లేకపోవడంతో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.2012 జూన్ 13 న మిల్లింగ్ షాపు-2 లో భారీ పేలుడు సంభవించి 19 మంది విగతజీవులయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ చరిత్రలో ఇప్పటివరకు 2012లో జరిగిన ప్రమాదమే పెను దుర్ఘటన. ఈ ప్రమాదం నుండి యాజమాన్యం గుణపాఠాలు నేర్వని పరిస్థితిలో 2014 నుంచి 2026 వరకు పలు సార్లు ప్రమాదం జరుగుతూనే ఉన్నాయి. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు తూతూ మంత్రంగా జరుగుతాయన్న ఆరోపణలు ఉండనే ఉన్నాయి. ఇచ్చిన నివేదికలు కాగితాలకే పరిమితం అవుతాయి. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఒకప్పుడు 18 వేల మందికి పైగా శాశ్వత ఉద్యోగులు, కార్మికులు ఉండేవారు. కారణాలు ఏమైనా పదవీ విరమణ, స్వచ్ఛంద పదవీ విరమణ , ఖచ్చితమైన పదవీ విరమణ ఇలా వివిధ కారణాలతో నేడు శాశ్వత కార్మికులు, ఉద్యోగుల సంఖ్య సగం కంటే తక్కువ ఎనిమిది వేల లోపు సంఖ్యకు చేరింది. దీనికి తోడు దాదాపు 6000 మంది ఒప్పంద కార్మికులను సైతం తొలగించారు. పేరుకు పెద్ద స్టీల్ ప్లాంట్ అయినా నామమాత్రపు కార్మికులతో విధుల్లో ఉన్నవారిపై పని భారం పెరిగింది. నిపుణత కలిగిన కార్మికులకు బదులు అవగాహన లేని కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయించడం యజమాన్యం ఒక సంస్కృతి లా కొనసాగిస్తోంది . సమాన పనికి సమాన వేతనం చట్టం గాలికి వదిలారు. నేడు మృతుల్లో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న శాశ్వత కార్మికులు గుర్తింపునకు నోచుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు. ఉక్కు పరిశ్రమ శాస్త్రీయ నిర్వహణపై, భద్రత వైఫల్యాలపై కార్మిక సంఘాలు ఎప్పటికప్పుడు యజమాన్యం దృష్టికి తీసుకువచ్చినా నామ మాత్రపు చర్యలు జరిపి పరిశ్రమలు లాభాల బాటలో తీసుకురావడమే ప్రామాణికంగా యజమాన్యం పెట్టుకుంది. కార్మికుల విజ్ఞప్తులు చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లుగా ఉంది. స్టీల్ ప్లాంట్ మునగడకు ప్రధాన ముడిసరుకైనటువంటి సొంత గనుల కేటాయించడంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిని కార్మిక సంఘాలు ఎంత విమర్శించినా చలనం లేదు. కారణాలు ఏమైనప్పటికీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణ, మరో పరిశ్రమలో విలీనం చేస్తాం, ఇలా ఊగిసలాట మధ్య విశాఖ ఉక్కు యాజమాన్యం స్టీల్ ప్లాంట్ లాభాలకు కష్టపడి పని చేసే కార్మికులను కుదిరించడం పై పెట్టిన శ్రద్ధ, ప్లాంట్ రక్షణ చర్యలు విషయంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. యజమాన్యానికి లాభాల యావ, ఖర్చులు తగ్గించాలని తపన, కనీస భద్రత ప్రమాణాలను పాటించకపోవడంతో కార్మికులు బలిపశువులవు తున్నారు. కాస్టింగ్ మిషన్ వద్ద గతంలో 20 మంది నిపుణులు పనిచేసేవారు ఆ సంఖ్య క్రమంగా 13 నుంచి 12 కు తగ్గింది. అందులో ఎవరైనా కార్మికుడు సెలవు పెడితే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ఉన్న తక్కువ మంది కార్మికులతోనే ప్లాంట్ నిర్వహణ యజమాన్యం సాగిస్తోంది. ఇటీవల ప్రభుత్వం 11 వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం విశాఖ ఉక్కు కర్మాగారానికి ఇచ్చింది. అందులో కొంత భాగం పరిశ్రమ నిర్వహణకు విడిభాగాల ఆధునీకరణకు, కాలం చెల్లిన పరికరాలకు కేటాయించడంలో అశ్రద్ధ తో పాటు యజమాన్యం ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మత్తులతో ఫ్యాక్టరీ నడిపించడమే లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని విభాగాలు ఫ్యాక్టరీలో నిర్వహణ ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం కొసమెరుపు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే సర్వత్ రా దిగ్భ్రాంతి వ్యక్తంమైంది. కమిటీలు వేయడం, సమీక్షలు జరపటం ఎప్పటిలాగే జరుగుతున్నాయి. అయితే ప్రమాదాలకి కారణాలపై నిర్ధారణకు వచ్చినప్పుడు అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ యాజమాన్యం చూడాలి. అలాకాకుండా తాత్కాలిక చర్యలతో కాలం గడపడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నది సుస్పష్టం. అందువలన శాశ్వత పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు ఉండాలి. మృతుల కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలి, క్షతగాత్రులకు మేము ఉన్నామన్న భరోసా ఇవ్వాలి. వెనుకబడిన ఉత్తరాంధ్రలో విశాఖ ఉక్కు ఒక ఆశాదీపంగా వెలుగొందేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు ఉండాలి. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమ స్ఫూర్తి వృధాకాకుండా, నామమాత్రపు ధరలకు వేలాది ఎకరాలు భూములు ఇచ్చిన రైతుల త్యాగం నిర్లక్ష్యానికి గురి కాకూడదు. డా. ఎం. ఆర్. ఎన్. వర్మ, సీనియర్ జర్నలిస్ట్, విశాఖపట్నం, సెల్ : 9848069524.




# తక్షణమే యూనియన్ నాయకులకు మంత్రి నారా లోకేష్ క్షమాపణ చెప్పాలి

**- విశాఖ ఉక్కు బాధితుల పరామర్శకు మంత్రి నారా లోకేష్ రాకున్నా బాగుండేది - ప్రాణాలు కోల్పోయింది మీ కుటుంబ సభ్యులు కాదు కదా అని....- యూనియన్ నాయకులను మంత్రి నారా లోకేష్ ప్రశ్నించడం ఎంతవరకు సబబు - స్టీల్ ప్లాంట్ మేమే కాపాడమంటూ మంత్రి నారా లోకేష్ గొప్పలు**

- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్

( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖపట్నం: కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రవర్తనపై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఆయన బాధితులను పరామర్శించేందుకు రాకుండా ఉన్నా బాగుండేదని వ్యాఖ్యానించారు. ఇదే అంశమై ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రి వద్ద మంగళవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ.. ఒక వైపు ఆత్మీయులను కోల్పోయి బంధువులు, ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉంటే లోకేష్ మాటలు వారిని మరింత ఆవేదనకు గురి చేసాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేకపోవడం వలనే ప్రమాదం సంభవించిందని పలువురు యూనియన్ నాయకులు లోకేష్ వద్ద ప్రస్తావించగా.. ప్రాణాలు కోల్పోయింది మీ కుటుంబ సభ్యులు కాదు కదా? అని లోకేష్ బాధ్యతా రాహిత్యంగా సమాధానం చెప్పడం సరికాదన్నారు. ఇలాంటి సమాధానాలు చెప్పే కంటే అసలు బాధితుల పరామర్శకు రాకపోవడమే మేలని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో యూనియన్ నాయకులకు లోకేష్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు ఎంతో ఓర్పు సహనంతో మాట్లాడాలని, ముఖ్యంగా సున్నితమైన సందర్భంగా మరింత అప్రమత్తంగా మాట్లాడాల్సి ఉంటుందన్నారు. కానీ లోకేష్ సున్నితమైన సందర్భాలలో ఎలా మాట్లాడాలో తెలియని అపరిపక్వ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు.



### నిపుణులైన ఉద్యోగులు లేకపోవడమే ప్రమాదానికి కారణం : బి.వి.రామ్

నిపుణులైన ఉద్యోగులు లేకపోవడమే విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రమాదానికి ప్రధాన కారణం అని రామ్ ఆరోపించారు. విశాఖ ఉక్కులో నిపుణులైన ఉద్యోగులు లేకపోవడం వల్ల తీవ్రమైన నిర్వహణా లోపం ఏర్పడిందన్నారు. ఫలితంగా భారీ ప్రమాదం సంభవించి.. 8 మంది ప్రాణాలు కోల్పోయారని అనేక మందికి గాయపడ్డారని ప్రస్తావించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు కర్మాగారం కోసం పోరాడి న్యాయం చేస్తామని చెప్పిన కూటమి పెద్దలు ఇప్పుడు సంభవించిన ఘోర ప్రమాదానికి ఏం సమాధానం చెబుతారని బి.వి.రామ్ ప్రశ్నించారు.



## ఉక్కు కర్మాగారం ప్రమాద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుంది

- కే ఎన్ ఆర్



( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలిని సందర్శించిన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తో కలిసి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మరియు ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు,రాష్ట్ర హోంమంత్రి అనిత,విశాఖ ఎంపి శ్రీభరత్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుబాష్ బిజేపి జిల్లా అధ్యక్షులు పరశురామరాజు కూటమి నేతలతో కలసి గాజువాక ఇంచార్జ్ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం కేంద్రం బారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించారని అన్నారు. అదే విధంగా క్షతగాత్రులకు రూ. 10 లక్షల పరిహారం, చికిత్సకి అయ్యే ఖర్చు మొత్తం ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని చెప్పారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు. కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షల అందుతాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల మాదిరి మృతుల పిల్లల చదువులు కొనసాగించేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై విచారణకు బొకారో స్టీల్ ప్లాంట్ నుంచి త్రీ మ్యాన్ కమిటీ ఏర్పాటు చేసామని తెలిపారు. విచారణ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి సహకారం అందిస్తామని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకే తికపరమైన ఇబ్బందులు తెలుసుకునేందుకు త్వరలో కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. బుధవారం ఉదయం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, క్షతగాత్రులను పరామర్శించనున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు.. అన్న సెంటిమెంట్ ను గౌరవించి,స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకూడదన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని నరసింగరావు అన్నారు.

## 'పెద్ది' వివాదం.. గిరిజనుల నిరసన!!



( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) హీరో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలోని ఓ సంభాషణ గిరిజన జాతిని కించపరిచేలా ఉందని విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. 'కొండనా కొడకా' అనే పదం అభ్యంతరకరమని, ఇది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి విరుద్ధమని వారు ఆరోపించారు. ఈ అసభ్య పదజాలాన్ని వెంటనే తొలగించాలని.. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు డిమాండ్ చేశారు. సెన్సార్ బోర్డు తీరుపై కూడా వారు అసహనం వ్యక్తం చేశారు.

## గౌస్ పై హత్యాయత్నం, ఫోక్స్ కేసులు నమోదు : రమణమూర్తి



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఈనెల 6 న ఖమ్మం నగరంలో ఒక మైనర్ బాధితురాలి పై అత్యాచార యత్నం చేసి బిల్డింగ్ పై నుండి కిందకు తోసాడు అని, నిన్న రాత్రి బాధితిరాలు తండ్రి ఖమ్మం టూ టౌన్ పట్టణ పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు ఇవ్వగా హత్యయత్నం, పొక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించి బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసి, వైద్య పరీక్షలు చేయించడం జరిగింది. ప్రస్తుతం సేకరించిన ఆధారాల ప్రకారంగా ఈ కేసులోని నిందుతుడు ఎం డి గౌస్, (57) సం.లు, కార్ డ్రైవర్, నివాసం:రాపర్తి నగర్, జి ఫ్రైడ్ అపార్ట్ మెంట్, ఖమ్మం అను అతన్ని కేసు నమోదు అయిన 24 గంటల లోపు అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్ట్ నందు హాజరు పర్చనైనది. ప్రస్తుతం కేసు విచారణ లో ఉన్నందున, మిగిలిన వివరాలు పూర్తి దర్యాప్తు అనంతరం తెలియపర్చగలము. ఈ సంఘటన పై పోలీస్ వారు కఠిన చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కేసు లో బాధితురాలు అయిన బాలిక యొక్క ఫోటో లను గాని, పేరు వివరాలను గాని బహిర్గత పర్చుతూ సోషల్ మీడియా లో ప్రచారం చేస్తే, ఫోక్సో యాక్ట్ ,బిఎన్ఎస్ యాక్ట్ ప్రకారంగా కేసులు నమోదు చేస్తాం అని ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి హెచ్చరించారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదం.. బాధితులకు కేంద్రం భరోసా!



( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఏపీలోని విశాఖ స్టీల్ ప్లాంట్లో ప్రమాద స్థలాన్ని కేంద్ర మంత్రులు హెచ్.డి.కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా కుమారస్వామి బాధితులకు భారీ ఎక్స్గ్రేషియా ప్రకటించారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలు రిటైర్మెంట్ వరకు క్వార్టర్స్లోనే ఉండేందుకు అనుమతిస్తామని, ఇతర ఉద్యోగులతో సమానంగా వారి పిల్లల చదువులకు పూర్తి ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఏపీలో ఇకపై 24 గంటల్లోనే వెహికల్ రిజిస్ట్రేషన్



( నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ఏపీలో వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఇకపై 24 గంటల్లోనే వెహికల్ రిజిస్ట్రేషన్ జరిగేలా కొత్త విధానం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానం ద్వారా తొలుత మీరు వెహికల్ కొనగానే డీలర్ వద్దనే తాత్కాలిక రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అనంతరం అక్కడి నుంచి రవాణా శాఖకు ఆన్లైన్ ద్వారా మీ దరఖాస్తు వెళ్తుంది. అధికారులు పరిశీలించి శాశ్వత రిజిస్ట్రేషన్ కు ఆమోదం తెలుపుతారు. ఒకవేళ అధికారులు 24 గంటల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే ఆటోమేటిక్ గా ఆమోదం లభించేలా కొత్త విధానాన్ని రూపొందించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మొద్దు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు



భద్రాద్రి జిల్లా, చర్ల : :ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, ఇళ్ల మంజూరు పేరుతో ప్రజలను మోసం చేసే దళారులను నమ్మి ఎవరూ డబ్బులు చెల్లించవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, అర్హత ప్రమాణాల ఆధారంగానే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇల్లు మంజూరు చేయిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మరాదని, అలాంటి ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయ్ నాయుడు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడే పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాలు

### జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఉత్సవాలు



నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ :మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాలను నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జూన్ 10వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, ఎమ్మెల్సీ కుచూకుల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి. హాజరవుతారని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి.ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి.ఖాసీమ్ అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలందించిన ప్రముఖ వృద్ధులు, పౌరులు, సామాజిక సేవకులు, వివిధ రంగాలలో విశేష కృషి చేసిన ప్రముఖులను పుట్టపాగ మహేంద్రనాథ్ స్మారకార్థం ఘనంగా సన్మానించి గౌరవించనున్నట్లు వివరించారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజలు. అయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని మహేందర్ నాథ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పుట్టపాగ శ్రీనివాస్ కోరారు.

## ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం - గ్రామ అభివృద్దే నా ధేయం

-సీజనల్ వ్యాధులపట్ల ముందస్తు చర్యలు చేపడతాం

-భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హిరలాల్




ఖమ్మం జిల్లా, కారేపల్లి : జూన్ 9 : రానున్న వర్షాకాలమును దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కలిపిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామం లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించాకుండా గ్రామ వీధుల్లో, సైడ్ డ్రైనేజిలో మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టాలని , దీనికి ప్రజలు కూడా తమ వాంతు భాద్యతయుతంగా మేలగాలని పాలక వర్గ సమావేశం లో సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు.” ప్రజల ఆరోగ్యమే లక్ష్యం - గ్రామ అభివృద్దే మా ధేయంగా “ పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ , ఉప సర్పంచ్ భిక్కులాల్ , వార్డ్ సభ్యులు వీ.గాంధీ , సంధ్య , భూలి , మహేష్ , దేవి , జ్యోతి , అంకి , పంచాయతి సిబ్బంది రాందాస్ , హేంచంద్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి పట్టణం - వేశ్యకాంతుల చెరువు -‘



సత్తుపల్లి’) సత్తుపల్లి పట్టణం, వేశ్యకాంతుల చెరువు ప్రాంతం లో సర్వే చేసి ప్రభుత్వ భూమి ని గుర్తించాలి అని సత్తుపల్లి వీ=ా రెవిన్యూ అధికారులను ఆదేశించిన.... తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మరియు సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ యుద్ధ ప్రాతిపదికన సర్వే చెయ్యాలి అని, ప్రభుత్వ భూమి ని గుర్తించి అట్టి భూములను ఈ



కాంగ్రెస్ ప్రభుత్వంభూమి లేని పేద ప్రజలకు అందించే దిశగా సత్తుపల్లి నియోజకవర్గం మీూా రాగమయిగారు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో జరుగుతుంది అని తెలియజేసారు.... ఈ కార్యక్రమం లో రెవిన్యూ అధికారులు,సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, రైతులు, సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు..

# రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల ఎంట్రీ

-జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా ప్రవేశం..మరో రెండు, మూడు రోజులలో తెలంగాణ అంతటా విస్తరణ

-వారం రోజుల పాటు వర్షాల జోరు..పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్



హైదరాబాద్, జూన్ 9 : తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. జూన్ 4న కేరళ తీరాన్ని తాకిన రుతుపవనాలు సోమవారం మృగశిర కార్తె రోజున జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా తెలంగాణలోకి అడుగుపెట్టడం విశేషంగా మారింది. వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే మృగశిర కార్తె రోజునే రుతుపవనాలు రాష్ట్రంలోకి రావడం రైతాంగంలో ఆనందాన్ని నింపుతోంది. వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు సుమారు ఎనిమిది రోజుల ఆలస్యంగా తెలంగాణలోకి ప్రవేశించాయి. అయితే ప్రస్తుతం ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా రాబోయే రెండు నుంచి మూడు రోజులలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఉపశమనం లభిస్తోంది. ముఖ్యంగా దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తుండటంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రుతుపవనాల రాకతో వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది. ఇప్పటికే వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. చెరువులు, కుంటలు, జలాశయాలకు నీటి ప్రవాహం పెరిగే అవకాశముండటంతో సాగునీటి పరిస్థితులు కూడా మెరుగుపడనున్నాయి. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో నీటిమునిగే పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. విద్యుత్, రహదారులు, తాగునీటి సరఫరా వంటి కీలక సేవలకు అంతరాయం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రుతుపవనాల పూర్తి స్థాయి విస్తరణతో తెలంగాణలో ఖరీఫ్ సీజన్‌కు శుభారంభం కానుందని, రాబోయే రోజులలో వర్షాల పరిమాణం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రైతాంగం, ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

## ఐఐఐటీ జంక్షన్, డీఎల్ఎఫ్ కారిడార్ అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ..ఏం రమేష్

-మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచన-నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



సైబరాబాద్, జూన్ 9 : గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం, రహదారి విస్తరణ పనుల పురోగతిని సమీక్షించారు. శేరిలింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు ట్రాఫిక్ నిర్వహణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..నిర్మాణ పనుల నేపథ్యంలో రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను సులభతరం చేసే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి, డీఎల్ఎఫ్ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ సురేష్, సిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట.. బోయిని అనూష మహేష్ యాదవ్

-రాష్టానికి వేల కోట్ల రహదారి, హైవే ప్రాజెక్టులు మంజూరు చేసిన కేంద్రం

-కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి..బోయిన మహేష్ యాదవ్



హైదరాబాద్, జూన్ 9 : కేంద్రంలో భారతీయ జనతా పార్టీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందని హాఫీజ్‌పేట్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 435.29 కిలోమీటర్ల రాష్ట్ర రహదారుల అభివృద్ధికి సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సిఆర్ ఐఎఫ్) కింద సుమారు రూ.850 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని తెలిపారు. అలాగే నల్గొండ జిల్లాలోని జాతీయ రహదారి-565 బైపాస్ నిర్మాణానికి రూ.516 కోట్ల వ్యయంతో అనుమతి లభించిందని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 190 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.7,600 కోట్ల వ్యయంతో ఆమోదముద్ర వేసిందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి కూడా దోహదపడతాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు ఏవి చేపట్టిందో వివరించాలని బోయిని అనూష మహేష్ యాదవ్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహకరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు.

## 131 డివిజన్ మాణిక్య నగర్‌లో వి ఎం ఎస్ హంటర్ షూటోకన్ కరాటే అసోసియేషన్ వారి ఆహ్వానం

మేరకు నిర్వహించిన కరాటే ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జాలిగం రాకేష్ పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ జూన్ 09 : 131 డివిజన్ మాణిక్య నగర్‌లో వి ఎం ఎస్ హంటర్ షూటోకన్ కరాటే అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు నిర్వహించిన కరాటే ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జాలిగం రాకేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కరాటే శిక్షణ కేంద్రం యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. క్రీడలు మరియు మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కాలనీ సభ్యులు,సంస్థ ప్రతినిధులు, శిక్షకులు, క్రీడాకారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.జాలిగం రాకేష్ ఉద్యమకారులు/బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుత్బుల్లాపూర్

## పాపిరెడ్డి కాలనీ ప్రాంతాలకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలి

-హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన

-బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారబోయిన..రవి యాదవ్

-బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాలనీ వాసులు



శేరిలింగంపల్లి, జూన్ 9 : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, ఆర్‌జీకే కాలనీ, సురభి కాలనీ, ఆరంభ్ టౌన్‌షిప్ ప్రాంతాలకు వెంటనే ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడు మరబోయిన రవి యాదవ్ స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మరబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ..ఆయా ప్రాంతాలలో వేలాది మంది ప్రజలు నివాసం ఉంటున్నప్పటికీ సరైన ప్రజా రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగాలకు వెళ్లే కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ ప్రయాణ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు అధిక ఛార్జీలు వసూలు చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ, ప్రైవేట్ ఉద్యోగాలలో పనిచేసే కార్మికులు తమ సంపాదనలో గణనీయమైన భాగాన్ని ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు సర్వీసులను ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, బస్సు సౌకర్యం కోసం బీఆర్ఎస్ పార్టీ వెనుకడుగు వేయదని రవి యాదవ్ స్పష్టం చేశారు.

## కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కు మరో అసంతృప్తి సెగ



బెంగళూరు : మంత్రి రామలింగా రెడ్డి వ్యవహారం నుండి గట్టెక్కారనుకున్న తరుణంలోనే .. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కి మరో అసంతృప్తి సెగ ఎదురైంది. శాఖల కేటాయింపుపై అసంతృప్తితో ఉన్న ఇద్దరు నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో చర్చల కోసం ఢిల్లీకి బయలుదేరినట్లు తెలుస్తోంది. కృష్ణబేరె గౌడకు గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయించారు. అయితే, ఆ శాఖలోని బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బిడిఎ), బెంగళూరు మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ (బిఎంఆర్ డిఎ) వంటి కీలక విభాగాలను మాత్రం సిఎం తన వద్దే ఉంచుకున్నారు. దీనిపై కృష్ణ బేరె అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ సమస్య పూర్తిగా పరిష్కారమైన తర్వాతే ఆ శాఖ బాధ్యతలు చేపడతానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో ఆయన భేటీ కానున్నారు. గౌడతో పాటు ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ కూడా ఢిల్లీ వెళ్లినట్లు సమాచారం. ఇటీవల నగరాభివృద్ధి శాఖను కేటాయించడంపై రామలింగారెడ్డి అలకబూనిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ నగరాభివృద్ధి శాఖ పైనే కృష్ణ బేరె అసంతృప్తిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సోమవారం మాజీ మంత్రులు జగదీష్ షెట్టర్, డి.వి. సదానంద గౌడలతో సమావేశమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సీనియర్ నాయకులతో చర్చలు జరిపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.ు

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితులకు రూ.25 లక్షల పరిహారం

### కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం
### కేంద్ర మంత్రి కుమారస్వామి



ప్రజాశక్తి-విశాఖ : విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఆర్‌అండ్‌ఎల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాద స్థలాన్ని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,ఎంపీ భరత్, హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కుమారస్వామి, ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు చట్టబద్ధంగా వచ్చే బీమా, పీఎఫ్, గ్రాట్యుటీ ప్రయోజనాలకు అదనంగా రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని, అలాగే బాధిత కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగంతో పాటు వారి పిల్లలకు పూర్తి ఉచిత విద్యా సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. బాధితులు ప్రస్తుతం నివసిస్తున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే కొనసాగేందుకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా విచారం వ్యక్తం చేస్తూ, పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారని మంత్రి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఇతర ఉక్కు కర్మాగారాల నిపుణులతో ప్రత్యేక విచారణ కమిటీని నియమించామని, వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పిస్తారని పేర్కొన్నారు.ు

## పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. మండుతున్న ఎండలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రానున్న 24 గంటల్లో భిన్నమైన వాతావరణం నెలకొననుంది. ఒకవైపు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వానలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షం పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడవద్దని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు జిల్లాలలో మాత్రం భానుడి ప్రతాపం కొనసాగనుందని తెలిపారు. అక్కడ గరిష్టంగా 42ీజ నుంచి 43ీజ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు, విశాఖ సహా పలు కోస్తా జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.ు

## దుబాయ్‌లో ఏడుగురు భారతీయ కార్మికులు దుర్మరణం



దుబాయ్‌లో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు భారతీయ కార్మికులు దుర్మరణం పాలవగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సాంకేతిక లోపం కారణంగా రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఒక ట్రక్కును, కార్మికులతో వెళ్తున్న మినీబస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రక్కు అకస్మాత్తుగా ఆగడం, అదే సమయంలో మినీబస్సు డ్రైవర్ వెనుక ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. గాయపడిన తొమ్మిది మందిని స్థానిక ఆస్పత్రికి తరలించగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. భారత అధికారులు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ స్థానిక అధికారుల సహాయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

# గాడ్జిల్లా వచ్చేస్తోంది! భారత్‌పై దాని నీడ పడితే..



పశ్చిమాసియా సంక్షోభంలో సంయమనం పాటించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే కోరుతున్నారు. కానీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తన దారి తనదేనన్నట్లు వ్యవహరిస్తున్నారు. లెబనాన్ రాజధాని బీరూట్‌పై దాడులతో మళ్లీ యుద్ధాన్ని మొదలుపెట్టినంత పని చేశారు. ఇది శాంతి ప్రయత్నాల్లో ఉన్న ట్రంప్‌నకు సాధారణంగానే చిర్రెత్తుకొచ్చేలా చేసింది. ఒకవైపు తాను కాల్పుల విరమణ కోరుతూ ఇరాన్‌తో ఒప్పందం కోసం ప్రయత్నిస్తుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని మాత్రం కవ్వింపు చర్యలకు దిగడాన్ని ట్రంప్ ఏమాత్రం తట్టుకోలేకపోతున్నారు. ఈ మధ్య కాలంలోనే వీళ్లిద్దరి మధ్య వాడివేడి సంభాషణలు జరిగినట్లు.. అందులో ట్రంప్ నెతన్యాహును చెడామడా వాయించినట్లు అమెరికా మీడియా వరుసబెట్టి కథనాలు ఇస్తోంది. అయితే ఇజ్రాయెల్ మాత్రం ఆ స్థాయిలో తిట్టనేలేదని.. సున్నితంగా మందలించారనే అంటోంది. ఈ క్రమంలో మంచి స్నేహాన్ని చెడగొట్టుకుంటూ.. 'ఒంటరి అయిపోతావ్ జాగ్రత్త!' అని హెచ్చరించేదాకా నెతన్యాహు ఎందుకు తెచ్చుకుంటున్నారు అనేది పరిశీలిస్తే.. ఇరాన్‌పై మరోసారి దాడులకు ఆదేశించడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పైకి చూస్తే ఇది కేవలం హెజ్బొల్లా కోసమో, ప్రతీకారం కోసమో చేసిన దాడిలా కనిపించినా.. అసలు లక్ష్యం మాత్రం వేరే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో ఇజ్రాయెల్‌కు ప్రాధాన్యం దక్కేలా ఒత్తిడి తీసుకురావడమేనని చెబుతున్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. దీంతో ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత తొలిసారిగా ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లయ్యింది. అయితే ట్రంప్ జోక్యంతో ఇరుదేశాలు తాత్కాలికంగా కాల్పులు నిలిపివేశాయి. ప్రస్తుతం అమెరికా, ఇరాన్‌తో శాంతి ఒప్పందం కోసం చర్చలు జరుపుతోంది. కానీ, ఆ చర్చల నుంచి ఇజ్రాయెల్‌ను తొలి నుంచే దూరంగా ఉంచినట్లు.. ట్రంప్ వ్యవహార శైలిని బట్టి ఇట్టే అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో "మా ప్రయోజనాలను పట్టించుకోకుండా ఎలాంటి తుది ఒప్పందమూ సాధ్యం కాదు" అనే సంకేతాన్ని వాషింగ్టన్‌కు పంపేందుకే నెతన్యాహు ఈ పరిమిత దాడులకు ఆదేశించి ఉంటారని చర్చ నడుస్తోంది. ఇది మాత్రమే కాదు. ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైన అంశం.. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై దాడులు జరిపే స్వేచ్ఛ. ఒకవేళ భవిష్యత్తులో అమెరికా-ఇరాన్ ఒప్పందం కుదిరితే.. ఆ సైనిక చర్యలకు అవకాశమే ఉండకపోవచ్చు అని ఇజ్రాయెల్ భావిస్తోంది. అందుకే ఇరాన్ దాడులకు నేరుగా ప్రతిస్పందించి, "లెబనాన్‌లో మా చర్యలకు ఇరాన్ జోక్యం అంగీకరించం" అనే గట్టి సందేశాన్ని పంపింది. ఇక.. కాల్పుల విరమణ నేపథ్యంలో ట్రంప్, నెతన్యాహూ మధ్య విభేదాలు కొంతకాలంగా బయటపడుతున్నాయి. గత వారం బీరూట్‌పై జరగాల్సిన వైమానిక దాడులను ట్రంప్ ఫోన్ చేయడంతో నెతన్యాహూ నిలిపివేశారు. శాంతి చర్చలు దెబ్బతినకుండా ఉండాలన్నదే ట్రంప్ ఉద్దేశం. అయితే ఇజ్రాయెల్‌లో ప్రతిపక్షాలు మాత్రం "అమెరికా చర్చల కోసం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారా?" అంటూ నెతన్యాహూపై విమర్శలు గుప్పిస్తున్నాయి. స్వదేశం నుంచి ఈ ఒత్తిళ్లు కూడా నెతన్యాహును దాడులకు ఆదేశించి ఉండొచ్చన్న వాదన ఒకటి వినిపిస్తోంది. సైనిక నిపుణులు చెబుతోంది ఏంటంటే.. ఇజ్రాయెల్ ఒంటరిగా ఇరాన్‌పై దాడులు చేయగలిగినా దీర్ఘకాలిక యుద్ధాన్ని కొనసాగించే సీన్ మాత్రం లేదు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రక్షణ వ్యవస్థల కోసం అమెరికా సహకారం కీలకం. అందువల్ల ట్రంప్‌తో పూర్తిగా విభేదించే పరిస్థితి కూడా ఇజ్రాయెల్‌కు లేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్‌పై తాజా దాడులు కేవలం సైనిక చర్యలు మాత్రమే కాదు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో ఇజ్రాయెల్ ప్రయోజనాలను విస్మరించవద్దనే రాజకీయ హెచ్చరికగా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ట్రంప్ శాంతి ప్రయత్నాలు, నెతన్యాహూ భద్రతా ఆందోళనల మధ్య ఈ సమీకరణం భవిష్యత్తులో మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# టీఎంసీ అంతర్విస్ఫోటనం!




ఎన్నికల ఫలితాలు వెలువడి పట్టుమని పాతిక రోజులు కాకుండానే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ)కి వీధుల్లో హింసతో మొదలైన ఎదురుదెబ్బలు ఇంకా ఆగలేదు. తాజాగా ఇండియా కూటమి సమావేశానికి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఢిల్లీ వచ్చిన సోమవారం నాడే ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేసి, తమదే అసలైన టీఎంసీ అనీ, ఎన్డీయేలో ఉంటామనీ స్పీకర్‌కు లేఖ రాశారు. వారి సంఖ్య 13 మాత్రమేనని పార్టీ చెబుతోంది. ఇప్పటికే టీఎంసీ శాసనసభా పక్షం చీలి, 58 మంది ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ నాయకత్వంలో వేరు కుంపటి పెట్టారు. తమనే ప్రధాన ప్రతి పక్షంగా గుర్తించమని స్పీకర్‌కు లేఖ రాశారు. స్థానిక సంస్థల్లో రాజీనామాలకూ, గోడ దూకుళ్లకూ కొదవే లేదు. 'స్ట్రీట్ ఫైటర్'గా పేరున్న మమత ఈ అరాచకాన్ని ఆపడానికి ప్రయత్నించకపోలేదు. కానీ అదేమీ ఫలితమివ్వలేదని తాజా పరిణామాలు చెబు తున్నాయి. ఫిరాయింపులనగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'వైస్రాయ్ ఎపిసోడ్' అందరికీ గుర్తొస్తుంది. కానీ ఆ జాడ్యం 'వైస్రాయ్' కన్నా చాలా పాతది. 1967లో హరియాణాలో గయాలాల్ అనే స్వతంత్ర శాసనసభ్యుడు వారం రోజుల వ్యవధిలో మూడు పార్టీలు మారినప్పుడు 'ఆయా రాం... గయారాం' అనే నానుడి మొదలైంది. ఫిరాయింపులకు ఆయన ఆద్యుడు కాకపోవచ్చుగానీ, వాటితో ఆయన పేరు శాశ్వతంగా ముడిపడి పోయింది. కానీ గత రెండు దశాబ్దాలనుంచి గుంపుగా వెళ్లి అవతలి పార్టీతో అంటకాగే ఉదంతాలు లేదా సొంత పార్టీ పెట్టుకోవడం వంటివి చోటుచేసుకున్నప్పుడల్లా... ప్రభుత్వాలు కుప్ప కూలినప్పుడల్లా ఆ పాత నానుడి పోయి, 'వైస్రాయ్ ఎపిసోడ్' గుర్తుకురావటం మొదలైంది. 1995లో జరిగిన ఆ ఉదంతం వెన్నుపోటుకూ, విద్రోహా నికీ, నయవంచనకూ బండగుర్తుగా మారిపోయింది. తన మామ స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా జిల్లా పర్యటనలో ఉండగా, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, అప్పటి రెవెన్యూ మంత్రి చంద్రబాబు తన విధేయులైన అరడజను మంది ఎమ్మెల్యేలను వైస్రాయ్ హోటల్‌లో పోగేసి, టీడీపీ చీలిపోయిందంటూ బ్రహ్మాండం బద్దలయిన స్థాయిలో అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుని, ఎమ్మెల్యేలను మభ్యపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి ఆ సంఖ్యను పెంచుకుంటూ పోయారు. ఆయన మిత్రుడు, నాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు సరేసరి... సకల వ్యవస్థలూ చంద్రబాబుకు సాగిలపడటంతో ఎన్టీఆర్ అధికారాన్ని కోల్పోయారు. కొన్ని నెలల వ్యవధిలోనే మనోవ్యథతో కన్ను మూశారు. ఇప్పటి 'రెడ్‌బుక్'లా ఆ ఉదంతానికి బాబు పేరెట్టినట్టు లేరుగానీ... ఈనాటికీ సకల రాష్ట్రాల ఫిరాయింపుదార్లకూ అదే శిరోధార్యం. 2014లో 23 మంది ఎమ్మెల్యేలను ఖరీదు చేయటం సంగతలా ఉంచి... 2024లో ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారం నుంచి వైదొలగాక కొందరు ఎంపీలతో పార్టీకీ, పదవికీ రాజీనామాలు చేయించటంద్వారా మళ్లీ ఆయనే 'నైతికత' ముసుగులో కొత్త రకం చీడకు గేట్లు తెరిచారు. మహారాష్ట్రలో 2022లో ఫిరాయింపులతో శివసేన, ఎన్సీపీలు చతికిలబడి అప్పటి మహావికాస్ అఘాదీ(ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. ఇప్పుడు విపక్షంలో ఉన్నా టీఎంసీకి అదే దుఃస్థితి ఎదురైంది. ఇదంతా మమత స్వీయ తప్పిదాల ఫలితమా... బీజేపీ చూపే ఆకర్షణల వల్లనా అని చర్చించటం వృథా. రెండూ నిజమే కావొచ్చు. కానీ మమత తప్పిదాలుంటే అవి ఇప్పుడే గుర్తుకురావటం, బీజేపీ ఆకర్షణలు చూపితే పార్టీ అధికారం కోల్పోయాకే ఎగబడటం వింత. గత నెల 4న వెలువడ్డ ఫలితాల్లో 45.92 శాతం ఓట్లతో, 208 సీట్లతో బీజేపీ అధికారంలోకి రాగా... 40.68 శాతం ఓట్లు, 80 సీట్లతో తృణమూల్ అధికారం కోల్పోయింది. అంటే ఓట్లపరంగా పెద్ద వ్యత్యాసం లేదు. కానీ టీఎంసీ ఎమ్మె ల్యేలూ, ఎంపీల్లో ఎంత అభద్రతాభావం! ఈ బాపతు ఫిరాయింపుల్ని అలా గోడదూకే వారిలో లోపించిన నైతికతగా మాత్రమే చూడటం సరికాదు. ఈ వికృత ధోరణుల్ని నిలదీసే కాలంపోయి... ఘనకార్యాలుగా, 'అపర చాణక్యం'గా అభివర్ణించే మీడియా వచ్చింది. ఇతర వ్యవస్థలూ తమకేమీ తెలియనట్టు నటిస్తున్నాయి. అందుకే ఈ గోడ దూకుళ్లు నిర్లజ్జగా సాగిపోతున్నాయి. కనుక పార్టీలు చీలిపోతే... ప్రభుత్వాలు పడిపోతే 'యూ టూ బ్రూటస్' అనుకుని ఆశ్చర్యపోవటం తప్ప ఎవరూ చేయగలిగింది లేదు.

# మరో ఆర్థిక అరాచకం




ఆర్థిక కుంభకోణాలు ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా జీవితం ఈ సినిమాకు కథా వస్తువు. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబి) స్వయంగా 109 పేజీల నివేదికతో గురువారం బహిర్గతం చేసింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేదు. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. కార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. స్విట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. మోడీ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి భారత్‌పై వాణిజ్య దాడిగా కుహనా జాతీయవాదాన్ని లేపి అదానీపై ఈగ వాలకుండా చూసుకుంది. నయా-ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఆ విధానాలను మోడీ ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుంది. స్కాంలు అనివార్యం. 'లక్కీ భాస్కర్లు' పుట్టుకొస్తూనే ఉంటారు. నష్టపోయేది సామాన్య ప్రజలే! అప్రమత్తం వహించాల్సింది ప్రజలే!!

# ముచ్చటైన మరో మూడు పక్షులు





## పసుపు చెంప పిట్ట , పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట , లీసెర్ విజిలింగ్ డక్ బేబీ శేషాచల అడవుల్లో గుర్తించిన గరుడ అట్లాస్ బృందం

## తిరుపతి ప్రాంతంలో ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

తిరుపతి సిటీ: తిరుపతి శేషాచల అడవుల్లో తిరుపతి నేచర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో మరో మూడు అరుదైన పక్షి జాతుల్ని గుర్తించినట్టు గరుడ అట్లాస్ బృందం ఆదివారం వెల్లడించింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) బృందంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది పరిశోధకులు పక్షిజాతుల గణన, వాటి వైవిధ్యం, మనుగడ, జీవన విధానంపై ప్రత్యేక సర్వే చేపట్టారు. 2022లో ఏర్పడిన తిరుపతి బర్డ్ అట్లాస్ ఇటీవల గరుడ అట్లాస్‌గా పేరు మార్చుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ, శేషాచల అడవుల్లోనూ సంచరించే పక్షిజాతుల డేటాను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. విడతల వారీగా అటవీ ప్రాంతాలలో సర్వే చేపట్టి అరుదైన పక్షి జాతులను గరుడ అట్లాస్ బృందాలు కెమెరాల్లో బంధిస్తున్నాయి. తిరుపతి ప్రాంతంలో తొలిసారిగా పసుపు చెంప పిట్ట (ఇండియన్ ఎల్లో టిట్) అనే అరుదైన పక్షిని కనిపెట్టామని గరుడ అట్లాస్ ప్రతినిధులు చెప్పారు. వీటితో పాటు పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట (ఎల్లో థ్రోటెడ్ బుల్‌బుల్), లీసెర్ విజిలింగ్ డక్ బేబీ వంటి అరుదైన పక్షిజాతులు తిరుపతి ప్రాంతంలో ఉండటం విశేషమన్నారు. కొండలపై నివసించే రాప్టర్ ఐన్ షాహీన్ ఫాల్కన్ పక్షులు సైతం తిరుమల ఘాట్ రోడ్డులో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని తెలిపారు.

ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

మానవ సమాజంతో పక్షిజాతుల అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఐజర్ బృందంలో పరిశోధకుడైన హరీష్ పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ బృందాలు ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాల్లో 55 వేల పక్షుల గమనాలను పరిశీలించాయని చెప్పారు. ఇందులో 274 పక్షిజాతులు ప్రకృతిలో మమేకమై ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5 ఎడిషన్లలో పక్షి జాతుల డేటాను సేకరించామని, వాటిని పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పుష్యామిత్ర, టీఎన్ఎస్ ప్రతినిధి పి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

# దమ్ముంది.. దన్ను కావాలి

## ఇప్పటికైతే మనది 10వ స్థానం

## ఏఐ మేధోనిధి.. ఇండియా!

## మెరికలున్నా సదుపాయాల్లేవు

## నైపుణ్యం ఒక్కటే సరిపోదు

## సూపర్ కంప్యూటర్‌లు... భారీ పెట్టుబడులు అవసరం

## ఏఐ సదస్సు చూపిన 'ఇంపాక్ట్'



ఢిల్లీలో ఐదు రోజుల ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఇటీవలే ముగిసింది. ఇండియా ఈ సదస్సును మొదటిసారి నిర్వహించింది. ప్రపంచ దేశాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలపై అంతా దృష్టి పెట్టారు. ఇండియాకైతే ఇది ఒక కీలకమైన సందర్భం. మన ఏఐ వ్యవస్థలో ఉన్న బలాలు, పూరించుకోవలసిన లోట్లను ఈ సదస్సు స్పష్టం చేసింది.

### నిపుణుల సంఖ్యలో రెండో స్థానం

ఏఐ రంగంలో మెరికలు ఉన్న దేశంగా ఇండియా పేరు పొందింది. కానీ మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబడి ఉంది. 2024 'టార్టాయిస్ గ్లోబల్ ఏఐ ఇండెక్స్' ప్రకారం, ఏఐ సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంది. ఏఐ నిపుణుల సంఖ్యలో మాత్రం 2వ స్థానంలో నిలిచింది.

### సౌకర్యాలలో 68వ స్థానం

ఏఐ ఆపరేషన్స్‌లో ఇండియా 3వ స్థానంతో మంచి ప్రతిభ కనబరిచింది. అయితే కంప్యూటింగ్ పవర్, ఇతర సౌకర్యాల విషయంలో 68వ స్థానంలో ఉంది. ఈ కారణంగా అమెరికా, చైనాతో పోటీ పడటం భారత్‌కు కష్టం కావచ్చన్న అభిప్రాయం ఏఐ పరిశ్రమంలో వ్యక్తం అవుతోంది.

### ఉన్నది కొన్నే సూపర్ కంప్యూటర్‌లు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత శక్తివంతమైన 500 సూపర్ కంప్యూటర్లలో ఇండియా వాటా కేవలం 1 శాతం మాత్రమే. అంటే, ఏఐకి కావలసిన కంప్యూటింగ్ సామర్థ్యం మన దగ్గర చాలా తక్కువగా ఉంది. అమెరికా ఈ విషయంలో చాలా ముందుంది. ప్రపంచంలోని మొత్తం సూపర్ కంప్యూటర్లలో 35 శాతం సిస్టమ్‌లు, దాదాపు 48 శాతం కంప్యూటింగ్ సామర్థ్యం అమెరికా దగ్గరే ఉంది.

### ట్రైనింగ్ డేటాలో 3 శాతం వాటా

ఏఐ ట్రైనింగ్ డేటా రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులలో భారతదేశం వాటా కేవలం 3 శాతం మాత్రమే. అంటే, మన దేశానికి చాలా తక్కువ పెట్టుబడులు అందుతున్నాయి. ఈ విషయంలో అమెరికా 56 శాతంతో అందరికంటే ముందుంది. ఆ తర్వాత చైనా 17 శాతంతో, ఐరోపా సమాఖ్య దేశాలు 15 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### ప్రపంచాన్ని శాసించగలమా?

మన దగ్గర అద్భుతమైన తెలివితేటలు కలిగిన నిపుణులు ఉన్నారు. కానీ, ఆ తెలివితేటలకు తగ్గట్టుగా శక్తివంతమైన కంప్యూటర్లు, భారీ పెట్టుబడులు తోడవాల్సి ఉంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే, కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యం మాత్రమే సరిపోదు; సొంతంగా డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లను పెంచుకోవాలి. అప్పుడే ఇండియా ఏఐ ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది.

**హెచ్.పి.సి. సిస్టమ్ : హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ (యంత్ర సామర్థ్యం)**

**హెచ్.పి.సి. కెపాసిటీ : హై పెర్ఫార్మింగ్ కెపాసిటీ (శక్తి సామర్థ్యం)**

**హెచ్.ఐ.సి.: హై ఇన్‌కం కంట్రీస్; యు.ఎం.ఐ.సి.: అప్పర్ మిడిల్ ఇన్‌కం కంట్రీస్**

**ఎల్.ఎం.ఐ. సి. : లోయర్--మిడిల్ ఇన్‌కం కంట్రీస్**

# నేటి పాత స్మార్ట్‌ఫోన్లే... రేపటి ఫైటర్ జెట్లు!

## ఫోన్ల నుంచి అరుదైన మూలకాల వెలికితీతకు యత్నాలు

కొత్త ఫోన్ కొనగానే పాతదానిని చెత్త ఫోన్ అంటూ చెత్తబుట్టలో పడేయడం చాలామందికి అలవాటు. కానీ ఆ పాత ఫోన్‌లో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'గా పిలిచే అత్యంత విలువైన భూ అయస్కాంత మూలకాలు అత్యంత సూక్ష్మపరిమాణంలో ఉంటాయి. వాటిని విదేశాల నుంచి వేలాది కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే బదులు ఈ పాత ఫోన్ల నుంచే సంగ్రహిస్తే? కేంద్రం ఇప్పుడు సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేస్తోంది. తద్వారా లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని భావిస్తోంది! "టన్ను ముడిఖనిజం నుంచి కేవలం ఒకట్రెండు కిలోల కోబాల్ట్ మాత్రమే తీయగలం. అదే టన్ను పాత బ్యాటరీల నుంచి ఏకంగా 50 నుంచి 80 కేజీల దాకా సమీకరించవచ్చు. పైగా ముడిఖనిజ కోబాల్ట్ కంటే ఇది 40 ఎక్కువ గాఢత కలిగి ఉంటుంది" అని గ్రేటర్ నోయిడా కేంద్రంగా పనిచేసే లిథియం--అయాన్ బ్యాటరీ తయారీ సంస్థ 'లోహం' రీసైక్లింగ్ హెడ్ సయ్యద్ గజన్‌ఫర్ అబ్బాస్ సాఫ్వీ చెప్పారు. "ఇప్పటికే ఎంతో శ్రమించి తయారుచేసిన స్మార్ట్‌ఫోన్ వంటి ఈ--వేస్ట్‌లో ఎంతో విలువైన ఖనిజాలుంటాయి. వాటిపై భారత్ ఇప్పటిదాకా సరైన దృష్టి సారించలేదు" అని ఈ--వేస్ట్ మేనేజ్‌మెంట్, లిథియం--అయాన్ బ్యాటరీ కంపెనీ అట్టెరో సహ వ్యవస్థాపకుడు నితిన్ గుప్తా చెప్పారు. యుద్ధ విమానాలు అత్యంత తేలిగ్గా, అత్యంత దృఢంగా ఉండటానికి నియోడైమియం వంటి ఈ మూలకాలే కారణం. వాటిలో ఇంధనం ప్రవాహాలు, రెక్కల కదలికలు, కాక్‌పిట్‌కు కరెంటు సరఫరా చేసే జనరేటర్లను పర్యవేక్షించే సెన్సార్లకు అవే శక్తినందిస్తాయి. "భారత్ ప్రస్తుతం ఈ--వేస్ట్‌ను విదేశాలకు అనవసరంగా ఎగుమతి



చేస్తోంది. అలాగాక భారత్‌లోనే భారీగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ--వేస్ట్‌లోని భూ అయస్కాంత మూలకాలను సంగ్రహించి యుద్ధ విమానాల తయారీకి సదీ?వనియోగం చేసుకోవచ్చు. అత్యంత అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి ప్రత్యర్థి దేశాలపై ఆధారపడే దురవస్థ తొలగుతుంది" అని ముంబై కేంద్రంగా పనిచేసే శుద్ధ సాంకేతిక సంస్థ 'లీకో' సీఈవో గౌరవ్ దోల్వానీ అన్నారు.

# మనోవేదనను 'మెషీన్' చెప్పేస్తుంది

## వాయిస్ శాంపిల్స్‌ను చిటికెలో విశ్లేషించి ముందే అప్రమత్తం చేస్తున్న మెషీన్ లెర్నింగ్ మోడల్స్

## తొలిదశలోనే మనోవ్యాధి లక్షణాలను పసిగట్టడంలో దోహదపడుతున్న సాంకేతికత

## తాజా ప్రయోగాల్లో 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో ఫలితాలు

## ఢిల్లీ ఎయిమ్స్ చేపట్టినపరిశోధనలో 78 శాతం కచ్చితత్వం నమోదు



ఒకరు చెబుతున్నది నిజమో లేక అబద్ధమో లై డిటెక్టర్ టెస్ట్ చిటికెలో చెప్పేస్తుంది. నాడీ స్పందనలు, బీపీలో హెచ్చుతగ్గులు, శ్వాస తీసుకోవడంలో మార్పులను విశ్లేషించి ఆయా అంశాలను నిర్ధారిస్తుంది. అదే తరహాలో డిప్రెషన్‌ను కేవలం ఒక్క వాయిస్ శాంపిల్‌తో మెషీన్ లెర్నింగ్ చాలా వరకు కచ్చితత్వంతో తొలిదశలోనే గుర్తిస్తోంది! ఈ మేరకు సాగిన అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైంది. సంప్రదాయ చికిత్సా పద్ధతుల్లో డిప్రెషన్‌ను నిర్ధారించేందుకు వైద్యులు రోగులను కొన్ని ప్రశ్నలడిగి వారి భావోద్వేగ పరిస్థితులను అంచనా వేస్తుంటారు. అయితే ఈ పద్ధతిలో బాధితులు వారంతట వారుగా ముందుకొస్తే తప్ప వైద్య సాయం చేసేందుకు వీలు ఉండదు. దీనివల్ల చాలా సందర్భాల్లో బాధితులకు వైద్య సహాయం ఆలస్యం అవుతోంది. కానీ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ సాంకేతికతను తెరపైకి తెచ్చారు. కుంగుబాటుకు గురైన వారి స్వరంలో హెచ్చుతగ్గులను మెషీన్ లెర్నింగ్ అల్గోరిథంల సాయంతో విశ్లేషిస్తున్నారు. కేవలం వాట్సాప్ ఆడియో ఫైల్స్‌ను విశ్లేషించడం ద్వారా డిప్రెషన్ బాధితుల లక్షణాలను 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో మెషీన్ లెర్నింగ్ టూల్స్ గుర్తిస్తున్నట్లు ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. 25--30 సెకన్ల ఆడియో ఫైల్‌లోని స్వరంలో హెచ్చుతగ్గులు, వాల్యూమ్, స్పీచ్ రేట్ వంటి శబ్ద లక్షణాలను విశ్లేషించడం ద్వారా ఆయా వ్యక్తుల మనోవ్యథను మెషీన్ లెర్నింగ్ మోడల్స్ గుర్తిస్తున్నట్లు చెబుతున్నారు.

### ఎయిమ్స్‌పరిశోధన ఇలా...

డిప్రెషన్‌ను ముందుగానే గుర్తించడానికి స్పీచ్ అనాలిసిస్ ఒక ఆచరణాత్మక సాధనంగా ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించేందుకు ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పరిశోధన నిర్వహించింది. ఇందులో భాగంగా పరిశోధకులు 423 మంది వాలంటీర్ల నుంచి (ప్రధానంగా 18--25 సంవత్సరాల ఏళ్ల వారు) సంతోషం, బాధలో ఉన్నప్పుడు మాట్లాడిన స్వర నమూనాలను సేకరించి విశ్లేషించారు. ఈ ప్రయోగంలో పాల్గొన్న వాలంటీర్లు వారి క్లినికల్ మానసిక ఆరోగ్య స్థితిని నిర్ధారించుకోవడానికి ప్రామాణిక మానసిక పరీక్షలను కూడా చేయించుకున్నారు. ఈ అధ్యయనంలో వారి స్వరం, స్వర స్థాయి, స్వర శక్తితో సహా వాక్పటిమ, ఉచ్ఛారణ, ఇతర గుర్తులపై పరిశోధకులు దృష్టి సారించారు. దీనిప్రకారం నిరాశతో మాట్లాడిన సందర్భాల్లో వాక్పటిమ, భావోద్వేగ స్వరం, తక్కువ స్వర స్థాయిలను గమనించారు. అలాగే వాయిస్ విశ్లేషణను క్లినికల్ డేటాతో పోల్చినప్పుడు నమూనా నాణ్యతను బట్టి మెషీన్ లెర్నింగ్ మోడల్స్‌దాదాపు 60 శాతం నుంచి 78 శాతం కచ్చితత్వంతో నిస్పృహ లక్షణాలను సరిగ్గా అంచనా వేశాయని గుర్తించారు.

### వాయిస్ నోట్స్ ద్వారా...

పీఎల్‌వోఎస్ మెంటల్ హెల్త్‌లో ప్రచురితమైన మరో నివేదిక ప్రకారం బ్రెజిల్‌కు చెందిన మానసిక వైద్య పరిశోధకుడు విక్టర్ ఒటాని నేతృత్వంలోని పరిశోధకులు... డిప్రెసివ్ డిజార్డర్ లక్షణాలు ఉన్న, అవి లేని వ్యక్తులను వేరు చేయడంలో మెషీన్ లెర్నింగ్ మోడళ్లు సహాయపడతాయా అని పరీక్షించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారి నుంచి స్వల్ప వ్యవధిగల వాట్సాప్ వాయిస్ సందేశాలను రికార్డ్ చేశారు. ఆ ఆడియో క్లిప్‌ల నుంచి సేకరించిన శబ్ద లక్షణాలపై ఏడు వేర్వేరు మెషీన్ లెర్నింగ్ నమూనాలు, ప్రామాణిక క్లినికల్ ఇంటర్వ్యూలను ఉపయోగించి కుంగుబాటును నిర్ధారించారు. దీని ప్రకారం ఏఐ నమూనాలు మహిళల్లో 91.67 శాతం వరకు, పురుషులలో 80 శాతం వరకు కచ్చితత్వంతో కుంగుబాటును గుర్తించాయి.

### ఇతర ప్రపంచ అధ్యయనాలు ఏమి చెబుతున్నాయి...

ది యానల్స్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్‌లో ప్రచురితమైన మరో అధ్యయనం మాటలు, స్పందనల్లోని నిరాశను గుర్తించడానికి ఏఐ--ఆధారిత వాయిస్ బయోమార్కర్ సాధనాన్ని మూల్యాంకనం చేసింది. మెషీన్ లెర్నింగ్ సాధనం 70 శాతం కంటే ఎక్కువ కేసుల్లో ఆడియో ఫైల్‌ను సమర్పించిన 25 సెకన్లలోనే మోస్తరు నుంచి తీవ్ర నిరాశలో ఉన్న బాధితుల స్వరాలను గుర్తించింది. యూఎస్, కెనడాలోని దాదాపు 15,000 మంది వయోజనుల నుంచి సేకరించిన వాయిస్ రికార్డింగ్‌లను పరిశోధకులు విశ్లేషించి అల్గోరిథం ఇచ్చిన ఫలితాలను ప్రామాణిక డిప్రెషన్ ప్రశ్నపత్రాలతో పోల్చినప్పుడు ఈ మేరకు ఫలితాలు వచ్చాయి. అయితే ఈ విధానం క్లినికల్ డయాగ్నోసిస్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు.

# వందలసార్లు చార్జ్ చేసినా... అస్సలు తగ్గని సామర్థ్యం!

## జింక్ అయాన్ బ్యాటరీ ఆవిష్కరణ

## నీటి ఆధారిత మూలకాలతో తయారీ



మనం ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీలన్నీ మండే స్వభావమున్న రసాయనాలతో తయారు చేసినవే. వాటికి పూర్తి భిన్నంగా నీటి ఆధారిత అణువులతో రూపొందిన వినూత్న జింక్ అయాన్ బ్యాటరీని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మెటీరియల్స్ (సీఈఎన్ఎస్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీంతో పునరుద్వాతక ఇంధన నిల్వ మరింత భద్రంగా, చవగ్గా, విశ్వసనీయంగా మారనుంది. ఈ విధానంలో తయారైన జింక్ అయాన్ బ్యాటరీని 500 సార్లు చార్జ్ చేసి వాడాక కూడా అచ్చం కొత్తదాని మాదిరిగా ఏకంగా 98 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని పరిశోధకులు వెల్లడించారు! సౌర ఫలకాలు, విండ్ టర్బైన్ల నుంచి తయారైన విద్యుత్‌ను నిల్వచేసేందుకు దోహదపడే జింక్ భూమిపై చవగ్గా, సులభంగా, విస్తారంగా లభిస్తుంది. బ్యాటరీలో జింక్ ఒకవైపు పొరగా పనికొస్తుంది. మరోవైపు క్యాథోడ్‌గా ఏ మూలకాన్ని వాడాలనేది ఇన్నాళ్లూ సమస్యగానే మిగిలిపోయింది. ఈ సవాలుకు మాలిబ్డినం డైసలై?పడ్‌తో సీఈఎన్ఎస్ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. మాలిబ్డినం, సల్ఫర్‌లతో దాన్ని తయారుచేశారు. సల్ఫర్ నుంచి అత్యంత పల్చటి పొరలను అభివృద్ధి చేశారు. అవి శక్తిని నిల్వ చేసుకోవడమే గాక నిరంతరాయంగా సరఫరా కూడా చేయగలవని నిరూపించారు. నియంత్రిత వేడి వ్యవస్థ విధానం ద్వారా దీన్ని సుసాధ్యంచేశారు. దీంతో బ్యాటరీని చార్జ్ చేసినప్పుడు శక్తి సులభంగా లోపలికి వెళ్లడమే గాక అంతే సులభంగా డిశ్చార్జ్ అవుతోంది. భద్రమైన, అత్యంత సుస్థిరమైన ఆపరేటింగ్ పరిమితి అయిన 0.2--1.3 ఓల్ట్ స్థాయిని శాస్త్రవేత్తలు సాధించారు. తద్వారా బ్యాటరీ పాడవకుండా వందలసార్లు చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. చార్జింగ్ అనంతరం వాడే క్రమంలో కేవలం 0.3 శాతం శక్తి మాత్రమే వృథాగా పోతోంది. మిగతాదంతా బ్యాటరీలోనే నిల్వ ఉంటోంది. ఇలా 99.7 శాతం 'కౌలంబిక్ ఎఫీషియెన్సీ' సాధించడం విశేషం. ఈ కాయిన్--సెల్ నమూనా బ్యాటరీని ఎల్‌సీడీ టైమర్‌కు చార్జింగ్ పెట్టడం ద్వారా వాణిజ్య స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికా కెమికల్ సొసైటీ 'ఎనర్జీ అండ్ ఫ్యూయల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .